ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

మార్చి 2019

సంపుటి : 25 (291) సంచిక : 3

మాతా పితా గురు దైవం!

ప్రేమ, వాత్సల్యములనెడివి రెండే బంధ మోక్ష కారకములు. సరళంగా జీవితాన్ని సాగింప చేసేవివే! భూమిమీద పడిన తరువాత బిడ్డ ఏడుపును మాన్ప గల శక్తి వీటికే ఉన్నది. అందుకే అవధనవతరించిన వారికి మాతా పితా గురు దైవం సుమీ అన్నారు పెద్దలు.

ఒక ఆచార్యుడు పది మంది ఉపాధ్యాయుల కన్నా ఉన్నతుడనీ, అలాటి నూరుగురు ఆచార్యులకన్నా తండ్రి గొప్పవాడని మనుస్మృతి వివరించింది. నవమాసాలూ మోసి, కని, పెంచిన తల్లి వేయి మంది తండ్రుల స్థాయి వాత్సల్య మూర్తి యని వక్కాణించి చెప్పారు. –అంటే మాతా పితలే గురు దైవాలన్నది సత్యం. బిడ్డకు తొలి అక్షరాన్ని నేర్పేది తల్లే! ఆమె నుంచి బిడ్డ అక్షరాలను నేర్చుకుంటున్నాడు. 'ఏకాక్షరం పరం బ్రహ్మ ప్రాణాయామాః పరం తపః' యని తండ్రి నుంచి 'ఓం' కారోపదేశం పొంది జ్ఞాని అగుటకు పునాదులు వేసుకుంటున్నాడు. భూః భువః సువః– వ్యాహృతులు గల గాయత్రీ జపమారంభిస్తున్నాడు. ఈ కారణంగా తల్లీ తండ్రీ లిరువురికీ గురు, దైవస్థాన మేర్పడింది. పాద నమస్కారం చేసినా, సాష్టాంగ వందనం చేసిననూ ఈ ఇరువురికే చేయాలి. కొన్ని స్మృతుల్లో తండ్రి, తాత, జ్యేష్ట సోదరుడు, పినతండ్రి, పెదతండ్రి, మేనమామ, మామ, శీలవంతులైన బ్రాహ్మణులు, తల్లి, పెత్తల్లి, పినతల్లులు, అత్త, మేనత్త, ఆచార్య పత్ని, జ్యేష్ట సోదరి, వదినలకు గురుస్థాన పాదాభివాదము చేయవచ్చునన్నారు.

గురుదైవాలైన మాతా పితరులు తరువాత పెద్దలకు గౌరవ వందనం చేయాలన్నది భారతీయ సంస్కృతీ ధర్మం. అంతేతక్క పాశ్చాత్య సాంప్రదాయాన్ని పుణికి పుచ్చుకుని మే, జూన్ నెలల్లో మాతా, పితృదినోత్సవాలను జరపడంతో చేతులు దులుపుకోవడం హాస్యాస్పదమనీ, జన్మనిచ్చి, జన్మకో మార్గం చూపిన మాతా పితరులే ప్రత్యక్ష గురుదైవములని మనుస్మృతి వక్కాణించి చెప్పింది. ఈ తరం వారు తమ తల్లితండ్రులను అలక్ష్యపరుస్తూన్నపుడు తన సంతతి కూడా అదే బాటలో పయనిస్తూ, భారతీయ సంస్కృతిని అలక్ష్య పరుస్తుందేమోనన్న సంశయం కలుగుతూంది. పిన్నవయసులోనే తమ పిల్లలకు నీతి శతకములు బోధించడం అవసరమని తల్లి తండ్రులు గ్రహించాలి.

బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు

(జూన్ 2005 ప్రముఖాంధ్ర)

Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-

"మానవతా మానవతా అదియే విశ్వంజీ మాట
సమైఖ్యత సమైఖ్యత అదియే విశ్వంజీ బాట
ఒకటే మాట, ఒకటే బాట
ఒక్క దేవునిదే ఈ జగమంతా"

అంటూ తమదంటూ ఒక సహజ శైలితో అందరికి సులభముగా అర్ధమయ్యే రీతిలో మానవతా విలువలతో కూడిన శాంతి, ప్రేమ తత్వమును విశ్వమంతా పాడుతూ, విశ్వశాంతియే లక్ష్యముగా పెట్టుకున్న విశ్వగురువులు భగవాన్ శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ గారి భౌతిక దేహానికి 75 వసంతాల అమృతోత్సవ వేడుకలు 22-02-2019 నుండి 05-03-2019 వరకు విశ్వనగర్, గుంటూరులో జరుగనున్నవి. ఈ సందర్భముగా శ్రీ ద్వాదశకుండాత్మక శతచండి పూర్వక శ్రీ మహారుద్ర యాగముతో కూడిన మరెన్నో వేద పరమైన కార్యక్రమాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమములు, విశిష్ట వ్యక్తులకు సన్మాన కార్యక్రమములు జరుప బడనున్నవి. తన భౌతిక జన్మదినమైన మార్చి 5 వ తేదిని విశ్వసమైక్యతా శాంతి దినముగా ప్రకటించడము విశ్వకుటుంబ సభ్యులందరికీ విదితమే. ఈ వేడుకలకు దేశ విదేశాలనుండి ప్రముఖులు, భక్తులు, శిష్యులు హాజరుకానున్నారు.

స్వామిజీ ఈ సందర్భములో అందరికి తమ దివ్యమైన ఆశీస్సులను అందజేస్తూ అందరిని భూమాతను గౌరవించి కలుషితము చేయకుండా ప్రకృతిని సేవించమని కోరారు. మానవుల ప్రధాన కర్తవ్యము భూమాతను కాపాడుకోవడమని, లేనిచో ప్రకృతి వైపరీత్యాలు తలయెత్తుతాయని హెచ్చరించారు. పంచభూత సమతుల్యత తప్పి, ప్రకృతి యుద్ధము ప్రకటించినచో, మనము తట్టుకోలేమని చెప్పారు. ఈ దివ్యసందేశమును స్వామిజీ పలుమార్లు మానవ సమాజానికి సులభముగా అర్ధమయ్యేలా తమ పాటలలో, పద్యములలో చెప్పారు.

"దేహమే దేవాలయం, హృదయమే దైవ పీఠం
పంచభూతముల సమ్మిశ్రతం, పంచ ప్రాణముల సమ్మోహనం"

అనే పాటలో మానవుడు దైవంశ సంభూతుడనే అద్వైత తత్వమును బోధిస్తూ

"మాత మనసా స్మరామి , భూమాత శిరసా నమామి
పంచభూత సమైక్య స్వరూపిణి, పంచప్రాణ ప్రమోద ప్రదాయిని"

అనే పాటతో పంచభూతాత్మకమైన దేహానికి, ప్రకృతికి, భూమాతకు అవినాభావ సంబంధముకలదని, మనిషి ఈ పంచభూత తత్వమును గుర్తించి తన్నుతాను శక్తిమంతుడుగా తీర్చిదిద్దుకుని తద్వారా సమాజానికి మేలు చేయవచ్చునని ఆదేశించారు. పృధ్వి, ఆపస్, తేజో, వాయు, ఆకాశ తత్వము కల్గిన ప్రకృతిలో సమతుల్యత తగ్గినపుడు యెట్లు ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడునో అటులనే మనిషిలోని పంచభూత తత్వములో సమతుల్యత తప్పినపుడు సమాజమునకు మేలు చేయడము మాని కీడు చేయుచున్నాడు. మనిషి మొదట తనలో తాను ఆత్మ విశ్వాసమును పెంపొందించుకొని, ఆత్మనిష్ఠ, ఆత్మనిగ్రహము ద్వారా ఆత్మ సంతోషమును తద్వారా ఆత్మసాక్షాత్కారమును పొందవచ్చునన్నారు.

దేవుడు ఎవరు, ఎక్కడ ఉన్నాడు అనే ప్రశ్నకు సమాధానముగా ఇలా తమ ప్రసంగముల మొదట

"కలదు చర్చిలోన కలదు మసీదు లోన
కలదు గుడిని చూడ కన్నులున్న
కణకణమునందు కలదురా పరమాత్మ
విశ్వయోగి మాట వినిన ఫలము"

పాడుతూ అనంతమైన విశ్వమే దేవుడని, ఆ విశ్వమునే పూజించమని

"విశ్వమందు విభుడు వెలుగొందు చున్నాడు
విభుని యందు వెలుగు విశ్వమెపుడు
విభుడు వెలుగకున్న విశ్వంబు వెలుఁగదు
విశ్వవిభుల మైత్రి శాశ్వతంబు" అని విశ్వమునకు, విష్ణువుకు, శివుడికి భేదము లేదని చెబుతారు. విశ్వము కలుషితము కాకుండా పూజించడము, ప్రేమించడము, గౌరవించడము దేవుడిని పూజించినట్లేయనిరి.

"ప్రక్కనున్నవారు బాధపడుచునుండ
గన్నుమూసి నీవు కాంచకుండా
పూజ లెన్ని చేయ బుణ్యంబు వచ్చునా?
శాంతిప్రేమదాయి! సత్యసాయి!"



మానవతా విలువలతో కూడి, హృదయమున ప్రేమనింపుకొని, మనస్సున శాంతినింపుకొని ఒకరికోసం అందరూకలిసి, అందరికోసము ఒక్కడు నిలిచి, ఒకే బాటలో నడచిన మేలు అని స్వామిజీ చెబుతారు. అందరిది ఒకే బాట, ఒకే మాట అయిన రోజు మానవులలో ఐక్యత కలిగి,సమైక్యతగా పరిణతి చెందవచ్చునన్నారు. స్వామీజీ లక్ష్యము అందరిని సమైక్యపరచి, శాంతి, ప్రేమల ద్వారా ఈ ప్రపంచము నందు శాంతి నెలకొల్పాలనేదే స్వామీజీ లక్ష్యము, ధ్యేయము.

“మతము లన్ని చేరి మతిచెడి కలహింప
బ్రతుక లేక ప్రేమ పరుగుదీయు
ప్రేమ లేని మతము పిచ్చిగా మారురా!
శాంతిప్రేమదాయి సత్యసాయి”

ఈ రోజులలో కులమత ద్వేషాలతో ఒకరినొకరు కొట్టుకుంటున్నారని, అన్ని మతముల ధ్యేయము ఒక్కటేనని విశ్వమానవ సమైక్యత స్తూపమును విశ్వనగరు నందు నిర్మించిరి. ఈ స్తూపము ఎనిమిది ద్వారములు కలిగి గుండ్రముగా ఉండును. ఈ స్థూపమునకు హిందూ, క్రైస్తవ, మహమ్మదీయ,సిక్కు, జైన, బౌద్ధ,యెహోవా మొదలగు ఏడు మతద్వారములు కలిగి, ఎనిమిదవదిగ నాస్తికులకు కూడా ఒక ద్వారము కలదు. వీటిలో ఏ ద్వారంగుండా లోపలి పోయినను అన్ని ద్వారములు ఒక్కచోటికే మనిషిని తీసుకొని వెళతాయని స్వామీజీ సందేశము.

పంచమాతలైన విశ్వమాత, పృద్విమాత, భరతమాత, గోమాత, మాతృశ్రీజనని లను అందరూ గౌరవించాలని, పూజించాలని,ఆరాధనాభావముతో సేవించాలని శ్రీ విశ్వంజీ పదే పదే చెబుతారు. తల్లి గురించి చెబుతూ, “మాతృదేవోభవ” అన్న సూక్తికి పట్టాభిషేకం చేసింది భారతీయ సనాతన ధర్మమని, తల్లి నవమాసములు బిడ్డను తన గర్భమునందు భరించి రెండవ జన్మ అనబడు ప్రసవ వేదన ననుభవించి బిడ్డను కని, తన సర్వస్వము త్యాగము చేసి ఉన్నతమైన స్థితికి ఎదగడానికి దోహదం చేస్తుందని, తల్లి మొదటి గురువని చెబుతారు.తల్లి ఒడి మొదటి బడియని, మాతృమూర్తులకు ఉన్న అత్యుత్తమ స్థానమును వివరిస్తూ, స్వామీజీ సనాతన ధర్మము స్త్రీలను గౌరవించమని చెప్పిందన్నారు. భవిష్యత్తులో ప్రేమతోగూడిన శాంతియుతమైన, శక్తివంతమైన సంఘము ఏర్పడటానికి ఒక స్త్రీమూర్తి సంక్షేమముగా ఆరోగ్యవంతమైన శిశువునకు జన్మనివ్వడమువలెనే సాధ్యమవుతుందని, స్వామీజీ ఒక దివ్యసంకల్పముతో విశ్వనగరునందు "VIMS - VISWAYOGI INSTITUTE OF MEDICAL SCIENCES" అన్న పేరుతో వైద్య, విజ్ఞానశాస్త్ర సంస్థనొకదానిని స్థాపించి, దానికి అనుబంధముగా స్త్రీ శిశువుల ఆరోగ్యం కోసం, వారి సంక్షేమం కోసం "VIMS - A MOTHER AND CHILD CARE HOSPITAL" అన్న ఒక సూపర్ స్పెషలిటీస్ హాస్పిటల్ నిర్మించిరి. ముఖ్యముగా పల్లెలలో నివసిస్తున్న పేద ప్రజలకు సరైన వైద్య సదుపాయాలూ అందుబాటులోలేవని గ్రహించి, ప్రాథమిక చర్యగా ప్రతి నెల మూడవ ఆదివారం నాడు విశ్వనగరులో ఉచిత వైద్య శిబిరాలు కొన్ని సంవత్సరములుగా భక్తులైన వైద్యుల సహకారముతో నిర్వహింపచేస్తున్నారు. ప్రతి నెల విశ్వనగరు చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఈ వైద్య సహకారమునందుకొనుచున్నారు. వారికి కావలసిన మందులన్నీ ఉచితముగా



ఇవ్వబడుచున్నవి.ఈ ఉచిత వైద్య శిబిరాలలో వివిధ వైద్యశాఖలలో ప్రవీణులైన వైద్యులు, హృద్రోగనిపుణులు, థైరాయిడ్ నిపుణులు, కంటివైద్యులు, దంతవైద్యులు మొదలైన వారు ఇతర నగరాలనుండి వచ్చి స్వచ్ఛందంగా స్వామీజీ పట్ల భక్తితో సేవలందిచడము పేర్కొన దగిన విషయము. ఈ వైద్యశాలను దివంగతులైన మాజీ రాష్ట్రపతి మాన్యశ్రీ డా॥ ఏ.పి.జె.అబ్దుల్ కలాం గారు ఏప్రిల్ 3వ తేదీ 2008 లో ప్రారంభించారు. వీరు విమ్స్‌కు శాశ్వత గౌరవ చైర్మన్. డా॥ ఏ.పి.జె. గారి దివ్యస్మృతితో స్వామీజీ పలు వైద్య ప్రముఖులను మార్చి 5 జన్మదిన సందర్భముగా, వైద్యశాల వార్షికోత్సవ సభ ఒకటి ఏర్పాటుచేసి, అందు సన్మానించనున్నారు.

ఈ అమృతోత్సవ సందర్భముగా మా ప్రముఖంధ్ర పత్రిక ద్వారా స్వామీజీకి పాదనమస్కారములు సమర్పిస్తూ, ఆశీస్సులను కోరుతున్నాము.

- గోటేటి నాగసాయిప్రసాద్

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

“అజంతా”

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

నవరస 'కవనా' సార్వభౌముడు

- మొదటి భాగం -

- భావరాజు పద్మిని

"మీ మౌనానికి ప్రతిధ్వనే నా పాట. నా పాటలన్నీ నా స్వగతాలు, అవి నాతో నేను మాట్లాడుకుంటూ ఉన్నట్టు ఉంటాయి కాబట్టి, ఎప్పుడూ మంచినే బోధిస్తాయి. నా ఆర్తిని, తృష్ణని, అన్వేషణని ఆవిష్కరించేలా రాయాలి అంటే గమనించడం, ఆలోచించడం, ప్రశ్నించుకోడం అవసరం అవుతుంది. సార్వకాలీనము, సార్వజనీనము, సార్వదేశీయము అన్న ప్రయోజనాలను అందరికీ కలిగించేలా రాయటమే నా ఉద్దేశం.

సినిమా వాళ్లకు ఉన్న ప్రయోజనం ఏమిటంటే కవిత్వం రాయాలి అని ఆశ ఉన్న వాడికి, రాయాగలిగే సత్తా ఉన్నవాడికి, రకరకాల సమస్యల్ని, రకరకాల సన్నివేశాల్ని బలవంతంగా ఇస్తూనే ఉంటుంది. తద్వారా అనేక కోణాల్ని, జీవితంలో పరిశీలించే అవకాశం ఉంటుంది. నా పాటని జనం వినాలి' అని నేను అనుకున్నప్పుడు, వాళ్ళు సినిమా కథను మర్చిపోవాలి. ఆ బాణీని మర్చిపోవాలి. మర్చిపోతే ఆ పాట మనది అనిపిస్తుంది, అనిపించాలి అన్నది నా ఉద్దేశం. సీతారామశాస్త్రి అంటే అందరు కవుల్లా కూర్చుని, ఏదో ఒకటి రాసి, నాలుగు డబ్బులు తెచ్చుకుని, నా పబ్బం గడుపుకోడం నా ఉద్దేశం కాదు. ఇచ్చిన సన్నివేశాలకు పూర్తి న్యాయం చెయ్యగలగడమే నాకు ముఖ్యం. కథ ఆత్మ తెలుసుకోవడం ఎంతైనా అవసరం. కథకు పాట సరిపోతే చాలదు. ఆ తర్వాత కూడా శ్రోత హృదయంలో ఆ పాట చిరస్థాయిగా నిలవాలి." అంటారు సిరివెన్నెల గారు.

తెలుగు సాహిత్యానికి తలమానికంగా నిలిచిన 'సాహితీ యుగకర్త' ఆయన. అందుకే 2019 లో భారత ప్రభుత్వం సిరివెన్నెల గారికి 'పద్మశ్రీ' ప్రకటించడం, వారి అభిమానుల మనస్సులో హర్షాతిరేకాన్ని రేపింది. తన పాటల ద్వారా, మనలో ఉన్న అనేక ఉద్వేగాలను సందర్భానికి తగ్గట్లుగా మేల్కొల్పగల సత్తా ఉన్న అక్షర శరాలను ఆయన మనపై సంధిస్తూ ఉంటారు. ఆయన అక్షరాలు - మనలో ఆలోచనలను రేకెత్తిస్తాయి, అశాంతిని తొలగిస్తాయి, ఆప్యాయంగా హత్తుకుని స్ఫూర్తినిస్తాయి, అనురాగాన్ని పల్లవింపచేస్తాయి, అన్యాయాలను ఎదిరిస్తాయి, అక్రమాలను ఖండిస్తాయి.

మనిషి జీవితంలో ఉన్న నవరసాలను ఆవిష్కరించేలా, ఆయన ఎన్నో పాటలు రాసారు. ఆ పాటలలో ఉన్న నవరసాలను విశ్లేషించుకోవడమే ఈ వ్యాసం ఉద్దేశం.

1. శృంగారం :

3000 పైచిలుకు పాటలను సినిమాలకు అందించినా, సిరివెన్నెల గారు వాటిలో ఒక్క అశ్లీల పదాన్నైనా వాడలేదు. ఈ విషయాన్ని ప్రముఖ గాయకులు ఎస్.పి.బాల సుబ్రహ్మణ్యం గారు 'పాడుతా తియ్యగా' కార్యక్రమంలో వ్యక్తపరచి, వారిని అభినందించడం జరిగింది. స్త్రీ ని అత్యున్నత స్థానంలో చూడడం తన సహజ స్వభావమని, అందుకే తాను రాసే పాటలు తన అమ్మతో, భార్యతో, బిడ్డలతో, కుటుంబంతో కలిసి హుందాగా వినగలిగి, చూడగలిగేలా ఉంటాయని చెబుతారు సిరివెన్నెల గారు.

అంతేకాకుండా, 'శృంగారం అనేది ఓ చెడు ప్రక్రియే అయితే... ఈ సృష్టే లేదని గుర్తుంచుకోండి. కాబట్టే శృంగారగీతం ఎంతో బాధ్యతాయుతమైనదని తెలుసుకోండి. ఇంకా ఎక్కువ పూజనీయమైనది, ఎక్కువ శ్రద్ధ పెట్టాల్సిందని అర్థం చేసుకోండి.' అని కూడా సందేశం ఇస్తారు. యువతను రెచ్చగొట్టే విధంగా తాను పాటలు రాయనని చెబుతారు.

మరి ఒక్క పదమైనా గట్టు దాటకుండా శృంగారాన్ని పండించడం ఎలాగ అంటారా? శృంగారం అన్న రసాన్ని తన పాటలలో అంతర్లీనంగా, నిగూఢమైన రీతిలో పండించడమే ఆయన ప్రత్యేకత. ఈ పాటలను పరిశీలించండి.

'చక్రం' అనే చిత్రంలో ఉన్న 'ఒకే ఒక మాట' అనే పాట చరణంలో

'నీకంటి మైమరపులో నను పోల్చుకుంటాననీ, తల ఆన్చి నీ గుండెపై నా పేరు వింటాననీ... నీకు చెప్పాలనీ' అంటారు.

కంటికి మైమరపు ఎప్పుడు కలుగుతుందో, అందులో నాయకుడు తనను తాను పోల్చుకునేది ఎప్పుడో, ఆమె గుండెపై తలవాల్చి ఆ హృదయ స్పందనలో తన పేరు వినేది ఎప్పుడో, ఒక్కసారి ఆలోచిస్తే, నర్మగర్భంగా చెప్పిన ఆ భావంలోని మాధుర్యం అర్థమవుతుంది.

అలాగే ఖడ్గం సినిమాలో 'నువ్వు నువ్వు ' అనే పాటలో ' నా సిగ్గుని దాచుకొనె కౌగిలివె నువ్వు , నా వన్నే దోచుకునే కోరికవె నువ్వు... తీయని గాయం చేసే అన్యాయం నువ్వు, అయినా ఇష్టం నువ్వు నువ్వు' అంటూ విరహంతో వేగిపోయే నాయిక స్థితిని వ్యక్తపరుస్తారు. పౌర్ణమి సినిమాలో 'పల్లకివై ఓహో, ఓహో భారాన్ని మోయ్ ఓహో ఓహో...' అంటూ మొదలుపెట్టి, బాణీలో పదాల అమరికతో మనల్ని సమ్మోహనపరచి, 'నిదర లేపాక తుంటరిగా అటో, ఇటో, ఎటో దూసుకుపోవాలోయ్' అంటూ నాయిక మనసుకు ఆవిష్కరిస్తారు.

శ్రీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్ అనే సినిమాలో 'ఏ నాడు విడిపోని ముడి వేసేనే' అన్న పాటలో వైవాహిక బంధం తర్వాత ఆ జంట తెలియాడే ఊహలను 'మోహన పారాడు వేలి కొనలలో, నీ మేను కాదా చైత్ర వీణ... వేవేల స్వప్నాల వేడుకలలో, నీ చూపు కాదా పూల వాన... రాగసుధ పారే అలల శ్రుతిలో, స్వాగతము పాడే ప్రణయము... కలకాలమూ కలగానమై, నిలవాలి మన కోసము... ఈ మమత' అంటూ రసరమ్యంగా అందిస్తారు. 'తెలవారదేమో స్వామి' అన్న శృతిలయలు చిత్ర గీతంలో 'మక్కువ మీరగా అక్కున జేరిచి అంగజుకేళిని పొంగుచు తేల్చగా... ఆ మత్తునే మది మరి మరి తలచగా .. మరి మరి తలచగా, అలసిన దేవెరి.. అలమేలు మంగకూ' అంటూ హృద్యంగా వర్ణిస్తారు.

సినిమా ప్రభావం సమాజంపై ఎంతో ఉంటుంది. నిజానికి ప్రస్తుతం కొన్ని సినిమాల్లో చూపుతున్నట్లు శృంగారం అనేది బాహాటంగా అందరికీ ప్రదర్శించే భావన కాదు. ఏకాంతంలో రెండు తనువులు, ఆత్మలు ఒక్కటిగా కలిసిపోయే పవిత్రమైన అనుభూతి. ప్రేమైక భావనలో తాదాత్మ్యం చెందిన ఆత్మల ఏకత్వ స్థితిని పైపాటల వంటి ఎన్నో పాటల్లో గుప్తంగా పొదిగారు సిరివెన్నెల గారు. ఈ రసాన్ని అశ్లీలం కాకుండా, విచ్చలవిడితనం లేకుండా, ఇంతకంటే అద్భుతంగా పదాలలో కూర్చి వర్ణించడం ఎవరికైనా దుస్సాధ్యమే.

2. వీరం :

యువతలో సహజంగా ఉండే వాడిని, వేడిని, పదాల్లో పొదగడం, వాటి ద్వారా పాటకు, నాయకుడికి, సందర్భానికి ఒక వెయిట్ కల్పించడం ఒక గొప్ప కళ. ఈ పరంగా సిరివెన్నెల గారి పాటలను పరిశీలిస్తే...

మహర్షి చిత్రంలో 'సాహసం నా పథం రాజసం నా రథం...' అన్న పాటలో వీర రసాన్ని అద్భుతంగా పలికించారు. అలాగే చంద్రలేఖ చిత్రంలోని పాటలో ఏవేవో చేసి, అందలాలు ఎక్కాలనే నాయకుడి తపనను 'సాహసమే చేయ్ రా డింభకా అన్నది కదరా పాతాళభైరవి,' అంటూ విచిత్రమైన రీతిలో పండించారు. ఒక రాజులోని శౌర్యాన్ని తెలిపే పాట గౌతమి పుత్ర శాతకర్ణి చిత్రంలో ఉంది. అదే 'సాహో సార్వభౌమ పాట...' ఇందులో ట్యూన్ కి తగ్గ 'కక్షల కాల రాతిరిలోన కాంతిగ రాజసూయ ద్వరమునే జరిపెరా... కత్తులలోన ఛిద్రం అయిన శాంతికి తానే వేద స్వరముగా... పలికెరా' అంటూ, పదాల అమరికలోనే నాయకుడి వీరత్వాన్ని ఢంకా బజాయించి చెప్పారు సిరివెన్నెల గారు. ఇలా ఎన్నో పాటలు ఆయన కలం నుంచి వీర రసంగా మారి ఆవిష్కరింపబడ్డాయి.

నీ కనులలో కొలిమై.. ఈనాటి ఈ సుప్రభాత గీతం నీకిదే అన్నది స్వాగతం..ఎక్కడో పైన లేదు యుద్ధమన్నది. అంతరంగమే కదన రంగమైనది.. ప్రాణమే బాణమల్లె తరుముతున్నది. నిన్ను నీవు జయించి రారా రాజశేఖరా అంటూ సిరివెన్నెల సీతారామశాస్త్రి రాసిన ఈ పాట ఆకట్టుకుంటున్నది.

3. కరుణ రసం :

కరుణ రసం ప్రధానంగా దుఃఖాన్ని ఆవిష్కరిస్తుంది. మనిషిలో అనేక సమయాల్లో అనేక రూపాలుగా ఈ దుఃఖం వ్యక్తమవుతూ ఉంటుంది. ఉదాహరణకు, ప్రేమలో విఫలమైన నాయిక/నాయకుడు పడే విరహ వేదన కూడా దుఃఖభరితంగానే ఉంటుంది. 'ఎలా చెప్పను?' చిత్రంలోని ఈ గీతాన్ని పరిశీలించండి...

"మంచు తాకిన ఈ వనం పూలు తొడిగేనా, మూగవోయిన జీవితం మళ్ళీ పలికేనా? చిరునవ్వులు ఇక ఈ పెదవులకి జ్ఞాపకమై మిగిలేనా? కల జారిన ఈ కనుపాపలకి నలువైపులా నలుపేనా, ఏమో ."

మంచు బాగా పడ్డప్పుడు, చెట్లు ఆకులు రాల్చి, మోడువారతాయి, అప్పుడు పూలు పుయ్యడం అనేదే సాధ్యం కాదు. ప్రకృతిలో సహజంగా ఉండే ఒక ప్రక్రియను నాయకుడి మనః స్థితికి అన్వయించి చెబుతూ... కళ్ళ నుంచి నీ ప్రేమ అనే కల జారిపోయింది కనుక, లోకమంతా నాకు చీకటైపోయింది, నాలుగు వైపులా నాకు నలుపే కనిపిస్తోంది అని చెప్పిన పద్ధతి... అనితరసాధ్యం.

నువ్వే నువ్వే చిత్రంలోని 'ఏ చోట ఉన్నా' అనే పాటలో తండ్రి అధీనంలో ఉండే నిస్సహాయమైన నాయిక పాత్రలో పరకాయ ప్రవేశం చేసి, 'నేల వైపు చూసే నేరం చేసావనీ, నీలి మబ్బు నిందిస్తుందా వాన చినుకునీ? గాలి వెంట వెళ్ళే మారం మానుకోమనీ, తల్లి తీగ బంధిస్తుందా మల్లెపువ్వునీ? ఏ మంత పాపం ప్రేమా ప్రేమించటం, ఇకనైనా చాలించమ్మా వేధించటం?' అంటూ వర్ణిస్తారు. ప్రకృతిలో ఏ వస్తువూ మరో వస్తువును బంధించదు. కాని మనిషి మాత్రం తనవారంతా తన అధీనంలో ఉండాలని శాసిస్తూ ఉంటాడు. ఇదే ప్రస్తుతం సమాజంలో, అనుబంధాలలో తలెత్తుతున్న పలు సమస్యలకు ప్రధాన కారణం. ఈ సందర్భంలో, ఈ పాట చక్కగా ఇమిడిపోయింది.

ప్రేమపరంగా ఉన్న దుఃఖాన్ని ఆవిష్కరించడం ఒక వైపైతే, స్వాతికిరణం చిత్రంలో తన గురువే శిష్యుడు తనను మించిపోవడం సహించలేనప్పుడు, గురుదక్షిణగా తన ప్రాణాన్నే అర్పించాలని సంకల్పించిన శిష్యుడు కడసారిగా పాడే 'జాలిగా జాబిలమ్మా...' అనే పాటను పాడతాడు. అందులో తన బిడ్డ అయిన వినాయకుడిని శివుడే సంహరించే సన్నివేశాన్ని, ఈ సందర్భానికి అన్వయించి తీసుకుని, 'ప్రాణ పతి నంటుందా, బిడ్డ గతి కంటుందా, ఆ రెండు కన్నుల్లో అది కన్నీటి చితి, కాలకూటం కన్నా ఘాటైన గరళమిది... గొంతు నులిమే గురుతై ఇంటనే ఉంటుంది...' అంటూ రాసిన ఒక్కొక్క మాట ప్రేక్షకుల మనస్సులో చెరగని ముద్ర వేసి, వారి హృదయాలను ద్రవింప చేసింది. చివరికి 'కంచికెళ్ళి పోయేవే కథలన్నీ...' అంటూ, నా కథ కంచికి వెళ్ళిపోతోంది... అంటూ చెప్పకనే చెబుతాడు శిష్యుడు. ఇలాంటి ప్రయోగాలు సిరివెన్నెల గారికే చెల్లు!

4. అద్భుతం :

కొన్నిసార్లు మన జీవితంలో అనుకోని అద్భుతాలు జరుగుతాయి. అవి చూసినప్పుడు మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ఈ రసాన్ని పండించే పాటలు ఎన్నింటినో రాసారు మన సిరివెన్నెల గారు.

చంద్రలేఖ చిత్రంలో రమ్యకృష్ణ నర్తకి, కాని ఆమె కాళ్ళు అనుకోకుండా చచ్చుబడిపోతాయి. ఒక కళాకారుడికి తన కళకు దూరం కావడం అన్నది మరణంతో సమానం. అలా జీవచ్ఛవంలా బ్రతుకు వెళ్ళదీస్తున్న ఆ నర్తకికి హఠాత్తుగా కాళ్ళు తిరిగి వస్తే... అదో అద్భుతమే కదా !

"నడియాడే నీ పాదం నటవేదమేనంటూ, ఈ పుడమే పులకించగా
నీ పెదవి తనకోసం అనువైన కొలువంటూ , సంగీతం నినుచేరగా
మా గుండెనే శ్రుతి చేయవా నీ వీణలా,
ఈ గాలిలో నీ కేళితో రాగాలు ఎన్నో రేగే వేళ
నీ మేనిలో హరివిల్లులే వర్ణాలవాగై సాగే వేళ ...ఉరుములు నీ మువ్వలై మెరుపులు నీ నవ్వులై తొలకరి మేఘానివై రా అలివేణి " అంటూ ఆమెకు కాళ్ళు తిరిగొచ్చే సమయంలో మన కళ్ళ వెంట నీళ్ళు వచ్చేలా చేస్తారు.

అలాగే పౌర్ణమి చిత్రంలోని 'భరతవేదముగ' అనే పాటలోని సందర్భానికి సతీదేవి కాలిపోతే, శివుడు రాయిలాగా మారిపోతే, ఆదిశక్తి ఆకృతి అయిన అద్రిజాత(పర్వత రాజ తనయ) పార్వతి, తిరిగి ఆయనలో చలనం తీసుకువచ్చిన ఘటనను అత్యద్భుతంగా అన్వయించారు. చిత్ర కథలో కూడా నాయిక అయిన తన అక్క(త్రిష), దుష్టుల కాంక్షకు బలైపోతే, ఆమె పాత్ర పోషించడానికి, కుటుంబ సంప్రదాయాన్ని నిలబెట్టి గ్రామాన్ని కరువు నుంచి కాపాడి, శివుడి కటాక్షం వలన వానలు కురిపించడానికి, అన్నింటినీ మించి తన అక్కను ప్రాణప్రదంగా ప్రేమించి, ఆమె మరణంతో ఒంటరైన నాయకుడిలో మళ్ళీ జీవం పొయ్యడానికి, అంతవరకూ నాట్యమే రాని చెల్లెలు (చార్మి) నాట్యం నేర్చుకుని మరీ పూనుకునే సన్నివేశం ఒక అద్భుతమే. తన పాటతో ఈ అద్భుతాన్ని అజరామరంగా సినీ జగతిలో నిలిపారు సిరివెన్నెల గారు. అలాగే ఆపద్బాంధవుడు చిత్రంలోని 'చుక్కల్లారా, చూపుల్లారా,' అనే పాటతో మతిస్థిమితం కోల్పోయిన నాయికను, నాయకుడు మళ్ళీ మామూలు స్థితికి తీసుకు రావడం మరో అద్భుతం.

5. హాస్యం :

'నవ్వడం ఒక భోగం, నవ్వలేకపోవడం ఒక రోగం' అన్నారు హాస్యబ్రహ్మ జంధ్యాల గారు. కాని జీవితంలో జరిగే కొన్ని సంఘటనల వల్ల మనం తరచుగా నైరాశ్యానికి గురవుతూ ఉంటాము. అందుకు కారణం ఒత్తిడి కూడా కావచ్చు. అటువంటి వారిలో స్ఫూర్తి నింపడానికి, నవ్వులు చిందించడానికి సిరివెన్నెల గారు రాసిన పాటలు చరిత్ర పుటల్లో పదిలంగా నిలిచిపోయాయి.

చిరునవ్వుతో అనే చిత్రం టైటిల్ సాంగ్ లో 'ప్రతిరోజునీ ప్రభవించనీ చిరునవ్వుతో, ప్రతి రాత్రిని పవళించనీ చిరునవ్వుతో' అన్న పాట, 'సంతోషం సగంబలం, హాయిగ నవ్వమ్మా 'అన్న పాట ఆనందంగా జీవించడం పట్ల ఆయనకున్న ఇష్టాన్ని తెలియజేస్తాయి. అలాగే లిటిల్ సోల్జర్స్ చిత్రంలో 'సరేలే ఊరుకో పరేషానెందుకు, చలేసే ఊరిలో జనాలే ఉండరా, ఎడారి దారిలో ఒయాసిస్సుండదా,' అంటూ పిల్లల్లో తిరిగి హుషారు నింపే గీతం ప్రేక్షకుల మనస్సులో కరుణను, నవ్వుల్నీ ఒకేసారి పూయించింది. అంతఃపురం చిత్రంలోని 'సూరీడు పువ్వా, జాబిల్లి నువ్వా, చినబోయినావెందుకే' అన్న పాట, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు చిత్రంలో, 'మరీ అంతగా మహాచింతగా మొహం ముడుచుకోకలా' అన్న పాటలు దిగులుపడ్డ మనస్సులో నవ్వుల జల్లులు కురిపించేవే.

ఇక స్ఫూర్తిదాయకమైన గీతాలతో నైరాశ్యం నిండిన వారిలో ఉత్సాహం నింపడానికి సిరివెన్నెల గారు రాసిన పాటల గురించి వచ్చే నెల రెండవ భాగంలో తెల్సుకుందాము.

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

గోదావరీ గట్టుందీ, గట్టునానుకుని కట్టుందీ! ఆనకట్టను కట్టిన కాటన్ ఆ దొర ప్రక్కనే తెలుగు ఇంజనీర్ వీరన్న విగ్రహముందీ!

భారతదేశాన్ని బ్రిటీష్ దొరలు పాలించే కాలంలో ఎందరో తెలుగు దొరలు (తెలుగువాళ్లు) సహాయకులుగా ఉండేవారు. బ్రిటీష్ వాళ్లెక్కువగా తెలుగువాళ్లనే విశ్వసించేవారనడానికి ఎన్నో తార్కాణాలూ ఎందరో చరిత్రా ఉంది.

సముద్రంలోకి వృధిగా పోతున్న గోదావరి జలాలను అరికట్టాలంటే ధవళేశ్వరం వద్ద ఆనకట్ట కట్టడం సముచితంగా ఉంటుందనీ, అందువలన ఉభయ గోదావరీ జిల్లాలూ సస్యశ్యామలవంతమై, ఆంధ్రదేశం దేశానికంతటికీ అన్నంపెట్టే అన్నపూర్ణ అవుతుందనీ కాటన్‌దొర గ్రహించాడు. తనకొచ్చిన మంచి ఆలోచనలకు సంతోషిస్తూ, కాలయాపనం కానీయకుండా వెంటనే నిర్మాణానికి నడుము కట్టాలని భావించాడు. అయితే తానొక్కడూ ఆ పనిని చేయగలడా? కూలీలూ, మేస్త్రీలతోటీ పని తీరిపోతుందా' – అని ఆలోచిస్తున్న సమయంలో ఆయనకు విద్యాధికుడూ, ఇంజనీరింగు చదివిన పట్టభద్రుడైన వీణం 'వీరన్న' తగిన వ్యక్తిగా తోచిందాయనకు.

వీరన్నగారు స్థానికుడు కావడంతో కాటన్ దొరగారు ఆయన్ను ఓవర్సీర్‌గా ఆనకట్ట పనిలోకి తీసుకున్నారు. ఆ పని ఏంవీ అంత సులభమైనది కాదు, వేలాది కూలీలను క్రమశిక్షణలో పనిచేయించాలి. వారిపై అధికారిగా గాక, వారిలో ఒకరిగా ఉంటూ, వారి ప్రేమ అండదండలతో పనిని చేయించారు. అవసరమైన సిబ్బందిని నియమిస్తూ, వారికి దగ్గరలో వసతిని కల్పిస్తూ, తానూ వారికి దగ్గరలోనే వాసమేర్పరచుకొని ఆనకట్ట నిర్మాణ పర్యవేక్షణ సాఫీగా సాగాలి. వీటన్నిటినీ తూ.చ. తప్పకుండా చిత్తశుద్ధితో చేసి కాటన్‌దొర ప్రశంసలందుకున్నారు. అప్పుడు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం జిల్లాగానే ఉండేది. కాకరపర్రు నుంచి ఆయన మకాము ధవళేశ్వరానికి మారిపోయింది. ఆయన పేరు ప్రతిభ మద్రాసు వరకూ పాకింది. అప్పటి మద్రాసు గవర్నర్ ఆయన్ను ఘనంగా సన్మానించారు. సాలీనా 500 రూపాయలు శిస్తు వచ్చే మెర్నిపాడు గ్రామాన్ని వీరన్నకు దానంగా యిచ్చారు. ఇది 1860 ఏప్రిల్ 27న జరిగింది.

కాటన్‌తో బాటు వీరన్న కృషి అమేయమైనదని, పైగా ఆంధ్రుడని, మేస్త్రీ నుంచీ అంచెలంచెలుగా ఇంజనీర్ పదవికి ఎదగడం, కాటన్ కృషిలో భాగస్వామి కావడం, కాటన్‌చేత ప్రశంసింపబడడం, గవర్నరు నజరానా యివ్వడం ఇవ్వన్నీ గ్రహించిన మద్రాసు శాసన సభా స్పీకర్ శ్రీ బులుసు సాంబమూర్తిగారు ధవళేశ్వరం ఆనకట్ట వద్ద ప్రతిష్ఠించిన కాటన్ శిలా విగ్రహం ప్రక్కనే వీణం వీరన్నగారి శిలావిగ్రహాన్ని 1939 సం॥ములో ప్రతిష్ఠింపచేయడం జరిగింది. శ్రీ వీరన్నగారు 1867 సం॥లో మరణించారు. తణుకు తాలూకా కాకరపర్రు గామంలో పుట్టారు. మొదట మేస్త్రీగా పనిలో ప్రవేశించారు. తగిన విద్యార్హతలు లేకపోయినప్పటికినీ స్వయంప్రతిభా విశేషములు, చిత్తశుద్ధితో ఓవర్సీరయి, సబ్ ఇంజనీర్ అయి ఇంజనీర్‌గా పదవోన్నతిని పొందారు. తెల్ల దొరలచే రావుబహద్దూర్ బిరుదము నొందారు.

సామాన్య స్థానాన్నుంచీ ఆ సామాన్య స్థానానికి ఎదిగి, ఎంత ఎదిగినా 'ఒదిగి' పనిచేస్తూ, అందరిచేతా మంచివాడూ, ప్రతిభావంతుడూ అని పేరుగాంచిన వీరన్నకు మన శ్రద్ధాంజలి ఘటిద్దాం. ●

Lovely Stay at Holy Tirupathi *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

ఫిబ్రవరి 22 నుండి మార్చి 5 వరకు స్వామీజీ 75వ జన్మదిన వేడుకలు

విశ్వసమైక్యతా దినంగా అత్యంత వైభవంగా భక్తులచే ఏర్పాట్లు

విశ్వగురుభ్యోనమః

భారతీయ సంస్కృతి గురుపరంపరాగతమైనది. మన ధర్మశాస్త్ర గ్రంథాలు సహితము గురుపరంపైనా, గురువు పైనా ఎంతో విశిష్ట స్థానాన్ని కల్పించాయి. భగవద్గీతను ప్రసాదించిన భగవానుడు సహితమూ గురువు సాందీపునిపై అచంచల విశ్వాసమునుంచాడు.

అజ్ఞానం కలుషం జీవం– జ్ఞానాభ్యాస ద్వినిర్మలమ్– అజ్ఞానం అనే కాలుష్యం పోవాలంటే జ్ఞానాభ్యాసం ద్వారానే అది మనకు సిద్ధిస్తుంది. ఆ జ్ఞానాన్ని ప్రసాదించే వారే గురువు. తల్లిదండ్రుల వద్ద, పాఠాశాలలో లభించని జ్ఞానం, జ్ఞానమూర్తులైన గురువుల వద్ద లభిస్తుంది. నా జీవితంలో నాకు నాన్నగారి దయవలన ఎందరెందరో గురువుల అనుగ్రహం కలిగింది. మా ఇంటికి ఎందరో గురువులు వచ్చి మమ్మల్ని పావనం చేస్తూ పునీతులను చేసారు. వీరిలో గుంటూరులోని శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మా కుటుంబ సభ్యులందర్నీ ఆకర్షించిన సద్గురోత్తములు.

స్వామివారి పరిచయ భాగ్యం షిరిడి సాయినాధుని సమక్షంలో జరిగింది. వారితో మాది రెండు దశాబ్దాల అనుబంధం. నాకిప్పటికి బాగా గుర్తు నాన్నగారు స్వామివారిని షిరిడీలో సందర్శించాక స్వామివారి ఆజ్ఞ ప్రకారం ఆయన్ని గుంటూరులోని విశ్వమందిరంలో దర్శించటానికి నేను నాన్నగారు బయలుదేరి వెళ్లాం. వెళ్లేటప్పుడు పినాకినీలో అన్ రిజర్వుడు కంపార్ట్‌మెంట్ అప్పటికి నాన్నగారికి ఏడుపదుల వయస్సు, ఆ వయస్సులో ఆయన్ని దర్శించాలనే పట్టుదలతో అలాగే వెళ్ళిపోయాం. ఉదయాన్నే స్వామీజీ దర్శనం చేసుకుని మాట్లాడి మళ్ళీ సాయంత్రం మరోమారు దర్శనం చేసుకుని రాత్రి బస్సుకి బయలుదేరాం. ఆ బస్సు ఉదయం ఆరు గంటలకు చెన్నై రావాలి కాని 11 గంటలకు వచ్చింది. అమ్మకు ఆరోగ్యం బాగాలేదు. ఆ విషయం తెలిసి స్వామీ ఆశీర్వాదం తీసుకుందామని వెళ్ళాం. కొంతకాలం అమ్మ ఆరోగ్యం పొడిగించబడింది. ఇలా ఎన్నెన్నో మా కోసం చేసారాయన. అలా ఆయన భక్తులను కనికరిస్తూ తన ప్రేమామృతాన్ని కురిపిస్తారు. ఎప్పుడు ఆయన మోములో ఆ చెక్కుచెదరని నవ్వు కనిపిస్తూ వుంటుంది. ఇది మా అనుభవమే కాదు. ఆయన దగ్గరకు వెళ్ళిన ప్రతి భక్తుని నమ్మకం అలాగే వుంటుంది. మా బావగారు శ్రీహనుమంతరావుగారు స్వామి అంకిత భక్తులు. వారే కాదు వారి కుటుంబం కూతురు, అల్లుడు, మనవడు దుబాయ్‌లో వుంటూ వారం వారం స్వామిని పలకరిస్తూ వుంటారు. సంవత్సరానికి రెండుసార్లు గుంటూరు వెళ్ళి కుటుంబ సమేతంగా దర్శించుకుంటూ వుంటారు. దేశవిదేశాలలోని అనేక ప్రాంతాల్లో అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ ప్రదేశాలలోని భక్తులు ఉపగ్రహ, దూరవాణిల ద్వారా స్వామీజీ ఆశీస్సులు అందుకుంటూ వుంటారు. అలాగే మా కుటుంబం మొత్తం విశ్వంజీ మహరాజ్‌గారి ప్రేమామృతాన్ని చవిచూసినవారమే. నేను, దూరదర్శన్‌లో వున్న తమ్ముడు, అమెరికాలో వుంటున్న రెండవ తమ్ముడు సాయి ప్రసాద్ అందరం ఆయన ఆజ్ఞలేకుండా ఏ పనీ చెయ్యం. మా సమస్యల్ని ఓపికగా వింటూ తగు సూచనలిస్తూ వుంటారు. అది గురువాజ్ఞగా భావించి మేము దాని ప్రకారం నడచుకుంటూ వుంటాం. నాన్నగారి నుండి మనవలు, మనవరాళ్ళ వరకూ ఆయన ఆశీర్వాదబలానికి పాత్రులైన వారమే. నాన్నగారి 75 వ జన్మదినోత్సవం స్వామివారి ఆశీస్సులతో, వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది. మా పెద్దమ్మాయి దివ్య పెళ్ళికి ఆయన ప్రత్యక్షంగా వచ్చి ఆశీర్వదించారు. నేను నడిపే గోటేటి గ్రాఫిక్స్‌కు ఆయన వచ్చి ఆశీర్వదించడమే కాకుండా ఆర్థిక ఇబ్బందులలో వున్నానని తెలిసి ఆయన ఒక డైరెక్టరి ప్రింటింగ్ ఇచ్చి దానికి ఆయన రొఖాన్ని ఇచ్చారు. ఇలా ఎన్నో ఎన్నెన్నో.

వారిపట్ల ఆకర్షితులవ్వడానికి ముఖ్య కారణం ఆయన భక్తులపట్ల, శిష్యులపట్ల చూపించే ఆ ప్రేమే ఒక ముఖ్య కారణం. ఇంటిలోని ప్రతివారిని పేరుపేరునా ఆయన పలకరించే తీరులో మనం పులకరించిపోతాం. సమస్యకు తగ్గ సలహాలనివ్వడం ఇలా రా అంటూ రక్షకట్టి వీపుమీద సున్నితంగా ఒక చిన్న దెబ్బ వేశారంటే మన బాధలన్నీ ఎగిరిపోయినట్లే. అంతటి కరుణా సముద్రులు. ఎప్పుడో ఎవరో ఒకరి కోసం ధ్యానంలోనే వుంటూ వుంటారు.

దత్త సాంప్రదాయానికి చెందిన విశ్వగురు పీఠానికి చెందిన విశ్వయోగి విశ్వంజీ మహరాజ్‌ను ఆయన భక్తులు దత్తావతార స్వరూపులుగా భావిస్తారు. అవిరామంగా భక్తుల కోసం శ్రమించే స్వామీజీ ఎప్పుడు నిద్రపోతారో, అసలు నిద్రపోతారో లేదో కూడా తెలియదు.

అంతేకాదు గుంటూరులోని విశ్వనగర్‌లో ఆ చుట్టు ప్రక్కల గ్రామీణులందరి కోసం వారికి అందుబాటులో ఉండేటట్టు ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని స్థాపించి కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లే స్తోమతు లేని బీదవారికి వైద్య సహాయం కల్పిస్తున్నారు. ఈ ఆసుపత్రి అప్పటి రాష్ట్రపతి శ్రీ అబ్దుల్ కలామ్‌గారి చేతులమీదుగా ప్రారంభింపబడటం జరిగింది. ఆ ఆసుపతిర్రలో స్వామీజీ అంకిత భక్తులైన వైద్యులు, దేశ, విదేశాల నుండి సలహాలను ఫోను ద్వారాను లేదా ప్రత్యక్షంగా వచ్చి అందిస్తున్నారు.

స్వామీజీ 75వ జన్మదినోత్సవాన్ని 'అమృతోత్సవం'గా 15 రోజుల ఉత్సవంగా జరిగేటట్లు శ్రీ ఆకుల కోటేశ్వరరావుగారు, ఈశ్వరమ్మలు ప్రణాళికను రూపుదిద్దారు. ఫిబ్రవరి 22, 2019 సంకట హర చతుర్థినాడు 108 కలశాలతో కల్పవృక్ష వరసిద్ధి వినాయకునికి అభిషేకం, సుహాసిని పూజ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి 108 కలాశాభిషేకం, మార్చ్ 2న, 3 తారీఖులలో కొన్ని పుస్తకావిష్కరణలు సాంప్రదాయ సంగీత కచేరీలు, మార్చి 4 తారీఖున శివరాత్రి సందర్భంగా 24 గంటల సేపు శతచండీపూర్వక శ్రీమహారుద్ర యాగం, సాయంత్రం ఎస్.వి. రమణమూర్తిగారిచే అపూర్వ సప్తస్వరరాధనం జరుగనున్నవి.

స్వామీజీ పుట్టినరోజైన మార్చి 5 ఉదయం ఆయుష్‌హోమం, ధన్వంతరీ హోమం, మృత్యుంజయ హోమం, పూర్ణాహుతి, విశ్వదత్తవ్రతం జరుపుటకు అన్ని ఏర్పాట్లు చేసియున్నారు. సాయంత్రం 8.30కు స్వామీజీ ఆశీఃపూర్వక అనుగ్రహభాషణం ఇవ్వనున్నారు. ఈ 75వ అమృతోత్సవానికి దేశవిదేశాల నుండి ఎంతోమంది భక్తులు పాల్గొననున్నారని తెలియవచ్చింది.

మానవ వికాసం కోసం, మానవతా విలువల్ని, విశ్వకుటుంబ సాంప్రదాయాభ్యున్నతి కోసం, అహరహమూ అకుంఠిత దీక్షాదత్తతలతో కృషి చేస్తున్న స్వామీజీ పేదసాద మధ్యతరగతి ప్రజల అభ్యున్నతికి మరిన్ని బృహత్ పథకాలనురూపొందించి వారిని ఆదుకోవాలని ప్రముఖాంధ్ర ఆకాంక్ష.

– గోటేటి వెంకటేశ్వరరావు

విశ్వమే నగరంగా రూపుదిద్దుకున్న విశ్వయోగి విశ్వంజీ 63వ జన్మదినోత్సవ వైభవ కిరణాలు

విశ్వమే నగరమైన వేళ అది. పరవళ్లుద్రొక్కుతూ పువ్వులవలె ప్రేమయు, దైవభావమూ సంతరించుకొని, జనులెల్లరూ ఎల్లల్నూ చించుకుని, జననగరాల ఆవాసాల్నుంచీ, కొండవీటి కొండలముంగిట ముగ్గుల్లా పరచుకొని ఉన్న 'విశ్వనగర్' చేరారు. విశ్వనగరు కాదది విశ్వమే నగర ముగ రూపొందిన జననగరమది. ఆధునిక జనం ఉన్నప్పటికీ, ఆధునిక నగర కాలుష్యం లేదు. నేషనల్ హైవే నెం.5కు అంటివున్నా, దుమ్మూధూళీ అంటి ఉండలేదు.

గగనాన తెల్లటి మేఘాలు – భువిని గోధూళి కాంతీ – రెండూ కలిసి భూపాలరాగం ఆలపిస్తున్నాయా – అన్నట్లుందా ప్రాంతం! పూలవాకిళ్ళలో సంధ్యాకన్నెలు రంగవల్లులు దిద్దినట్లున్నది. అది రాత్రి సమయం. పొలాలందు మడులు కట్టి, గట్టున గంట కట్టి యున్న ఎద్దులు, గళములోని గంటలు గలగల మ్రోగుతూ ఊగుతూంటుంటే, పల్లెపట్టున ఉన్న లేగలు మేతలు మేయకుండా, ఎలా పరవళ్లు తొక్కుతూంటాయో, పూపొదలపై మధ్యనున్న లేచిగుళ్లు హిమబిందువులతో జతకలిపి, గాలికెలా నృత్యమాడుతుంటాయో, అలా అదునుజూచి ఆమని కోయిల 'కుహు కుహు' రాగం పాడుతూంటే ఎలా ఉంటుందో, అక్కడి పర్యవేష్టిత మైన పచ్చ, నీలమణుల ప్రకృతీ కాంత ప్రశాంత సాంతంగా ఉంది.

మమతల్ని కురిపించే జనం; ప్రేమల్ని పంచే జనం సంకీర్తనా శ్రవణంగనినంతనే మనం స్పందించి, మురిసి మురిసి సంతోష సంబరాలతో గాలి కూడా లేనంత సన్నగా ముస్తాబు చేసుకుని, అడుగులో అడుగును సన్నగా, అలికిడి లేనంత సన్నగా వేయిస్తూంది. తోడు మీగడగా నాతో వచ్చిన తొంభై ఏండ్ల విద్వాన్ గోగినేని కనకయ్య గారు కూడా వడివడిగా ముందు బడి వెడు తుంటే, పులకిత ఆనంద భార భరితుడనైన నేను, మంద గమన గజంలా గజానికి తొమ్మిది అడుగులు వేస్తూ వెడ్తున్నాను.

అందరూ అది 'విశ్వనగర్' అంటున్నారు. నేను అక్కడి వివిధ ప్రాంతాల, సాగరాంతవాసుల్ని చూచి, 'విశ్వమే' నగరంగా రూపొందిందంటున్నాను. అందు జంబూ ద్వీపవాసులే గాకుండా, క్రౌంచ ద్వీప (అమెరికా) వాసులు కూడా ఉన్నారు; భారత రాజనగర వాసులున్నారు. అందర్నీ కంటూంటే విశ్వమే నగరమనీ, పారిజాతాది పరిమళ పుష్ప విలాసినీ సీమయనీ, ఎందెందు ఏ దెస చూచినా దేవతా శిల్పాలేనని, విశ్వకర్మ రూపొందించిన లంకా నగరమును పునర్నిర్మితం చేశారా – అనెడి భావం కూడా కలిగింది. ఏడాదీ, ఏడాదిన్నర క్రితం నేను చూచిన విశ్వనగర్‌కూ ఇప్పటి విశ్వనగర్‌కూ పోలికే లేదు. పరమసుందరమైన గార్డెన్ సిటీగా బెంగుళూరును, గార్డెన్ స్టేటుగా 'న్యూజెర్సీ'ని ఎలా అభివర్ణిస్తూన్నారో – ఆ పేరులేఁవీ ఈ విశ్వనగర్ పేరునందు పనిచేయవనిపించింది.

ఇది విశ్వయోగి విశ్వంజీ తపః (శ్రమఫలితమనను) ఫలం. మట్టీ రాయీ రెండూ బంగారమయ్యాయి. తీగల్లేని ఫోను పరిధిలా విస్తృతమైంది. వెనుకనున్న కొండలన్నీ వెనుకకే జరిగి జరిగి 'విశ్వంజీ మందిర ఉనికికి చోటు కల్పించాయా అని కూడా అనుకున్నాను. ఇదివరకింతటి విశాల విస్తృత పరిధి గల ఆశ్రమ ప్రదేశాన్ని చూచినట్లు లేదు! ఈ రాచబాట లేఁవిటి, ఈ శీతల కోమల భవానాలేఁవిటి, వృక్ష

సంపద ఏంటిటి, పుష్ప సంపద ఏంటిటి, నేల కనిపించడం లేదే – నింగిలో సహితమూ విశ్వనగరమే ప్రతిబింబిస్తున్నదే! కొండ అద్దమందు కొంచెమై ఉంటుందన్న వేమన మాటలు సత్యదూరమనిపిస్తున్నాయ్. పృథ్వి 'విశ్వనగరం' ముందు చిన్నదై ఉంటుందా – అని అనిపిస్తూంది.

విశ్వామిత్రుడు సర్వ తపఃఫలాన్నీ ఒడ్డి, త్రిశంకుని కోసం స్వర్గాన్ని నిర్మించినట్టు, విశ్వయోగి తన ఇంచుక తపఃఫలాన్నొడ్డి ఓ బృహత్ మాతా శిశు సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిని నిర్మించారు. ఇలా ఇంకెన్ని చికిత్సాలయాలు, వానప్రస్తాశ్రమాలు, శాకాంబరిశాలలు, విశ్వంబరి వసతి గృహాలూ నిర్మించారో!

రోజు రోజుకూ శుక్ల పక్షంలో శశాంకుడు నాజూకుగా పెరిగినట్టు ఈ విశ్వనగరం పెరిగిపోతూంది. ఇదివరకూ తాటి ఆకులూ, సిమెంట్ రేకులతో ఉన్న యాగశాలలకు చూరు మారిపోయింది. ఖాట్మండులోని కన్నెపిల్ల దేవాలయ సముదాయంలో పై కప్పులూ – పురాణాల్లో చెప్పుకునే వైకుంఠధామం జ్ఞాపకం వస్తుంది. పూర్వమున్న విశ్వస్థూపం, విశ్వ వలయా కారంగా ఉన్న స్థూప మందిరం ఫౌంటెన్లు, శివపంచా రామం, బుద్ధవిగ్రహం, అభయ ఆంజనేయస్వామి, లక్ష్మీసరస్వతి, రాధాకృష్ణ, వినాయక సుబ్రహ్మణ్య దత్తావతార శిల్పాల మాటటుంచితే – అక్కడ అహరహమూ సూర్యోదయమే తప్ప, రాత్రి రేణువులకవ కాశం లేదన్నట్టున్నది. విశ్వయోగి విశ్వంజీయే అక్కడి పొద్దు. ఆయన వేసే ప్రతీ అడుగుకు నలుదిశలా కాంతులు పరుచుకుంటూంటాయ్. స్వామీజీ ప్రేమామృత వర్షధారియై, కొందరి నుదుట నిడుపాటి కళ్యాణ బొట్టును దిద్ది, మల్లె, మరుమల్లె, గుండుమల్లె, బంతి చామంతి – కుసుమాలతో స్వయంగా పుష్పవర్షమును కురిపిస్తూ, ముఖ్య అతిథులచే కురిపింపచేస్తూ, పట్టువస్త్రములు కప్పుతూ, కుడి ముంజేతికి సువర్ణగొలుసు నలంకరిస్తూ, మృదువైన లేగులాబీ వంటి హస్తాలతో నిమురుతూ, ఆశ్శీఃపూర్వక సత్కారం చేయడం వర్ణించనలవి కాలేదు. అది మనోహర మంజుల మధురాను దృశ్యం. చూచినవారికే ఆ శోభ విదితమవుతుంది. ఆ అదృష్టశీలురలో 'ప్రముఖాంధ్ర' సంపాదకులు

గోటేటి శ్రీ రామారావు ఉండడం శుభకర విశేషం. పులకిత హృదయుడైన గోటేటి స్వామీజీ తనను తొలిగా షిర్డీలోని సాయినాధుని సన్నిధిలోనూ, అమెరికాలోని వాషింగ్టన్, న్యూజెర్సీల్లోనూ ఆశ్శీఃసత్కారం చేశారనీ, ఇపుడీ విశ్వనగర్‌లో చేసిన పుష్పవర్ష సత్కారం మరింత శక్తినీ కలుగచేసిందనీ, ఇలాటి సత్కారాలు స్వామీజీ చేతుల మీదుగా జరగాలని తాను కోరుకుంటున్నానంటూ, వినయపూర్వకంగా స్వామీజీకి పాదనమస్కారం చేయడం జరిగింది.

గోటేటి యావత్కుటుంబికులూ స్వామి భక్తులే!

దాదాపు దశాబ్దంపై చిలుకుగా గోటేటి శ్రీరామారావు కుటుంబ సభ్యులు విశ్వయోగి విశ్వంజీ అంకిత భక్తులు. దక్షిణ ఇండియా ఆర్యవైశ్య సంఘంవారు షిర్డీలో సత్ర నిర్మాణ శంఖుస్థానం చేయిస్తూ, విశ్వయోగి విశ్వంజీ కరకమలముల ద్వారా గోటేటి శ్రీరామారావుకు ఆశ్శీఃపూర్వక సత్కారం అందజేశారు. ఆ సమయంలో గోటేటి సతీమణికి తీవ్ర అనారోగ్యంగా ఉండడం గోటేటి తన జ్యేష్ఠ కుమార్డు వేంకటేశ్వరరావుతో గుంటూరు వెళ్లి విశ్వమందిరం లోని స్వామీజీని దర్శించడం, ప్రతీ సంవత్సరమూ స్వామీజీ చేసే కార్యక్రమాలకు గుంటూరు వెడ్తూండడం, జన్మదిన మహోత్సవములతో 'ప్రముఖాంధ్ర' ప్రత్యేక సంచికలు ప్రచురించడం, పెద్దబ్బాయి రంగుల బ్రోచర్లు, పాకెట్ క్యాలెండర్లు ప్రింటు చేసి అందివ్వడం, అమెరికాలో ఉన్న మూడవ అబ్బాయి సాయిప్రసాద్, అతని భార్య సుప్రీత మరింత అంకిత భక్తులు కావడం, మా పెద్దబ్బాయి బావమరిది హనుమంతరావు గారినీ, వారి శ్రీమతి పార్వతిగారిని కూడా వారి అనుంగు భక్తులు కావించడం, స్వామీజీ హృదయంలో మేమందరమూ స్థానం సంపాదించడం జరిగింది. ఈమధ్య హనుమంత రావుగారి భార్య ప్రాణాంతక స్థితిలో ఉంటే – జన్మదిన వైభవ వేదికపై ఉన్న స్వామి హఠాత్తుగా లేచివెళ్లి – ఓ అరగంట ధ్యానంలో ఉండి వచ్చారు. ఆమె ప్రాణం తిరిగి వచ్చిందన్నారు. స్వామీజీ దృష్టి పెడ్తే మరణం కూడా వాయిదా పడుతుందనే విషయం ఉపన్యాసకుల్లోని శివరత్నం గారు చెప్పారు.

కోటి జ్ఞాన మధ్యే హయ ఏక జన 'ముక్త'

– అన్నారు రూపగోస్వామి. కోటి మందిలో ఎవరో ఒకరు ముక్తుడవుతారు. అనుగ్రహంతో కూడిన వాత్సల్యం ప్రసరింప బడినప్పుడా సత్ఫలితం దక్కుతుంది. వేల యోజనాల దూరం నుంచీ విశ్వనగరం వచ్చారంటే స్వామిపై వాత్సల్యమూ, విశ్వాసమూ విమలమైన భక్తి శ్రద్ధలే కదా కారణం!

విశ్వకర్మ పార్వతీ మాత కోసం నిర్మించిన 'శ్రీలంకా సౌధం'లా ఉన్నది. (గత సంచికలో పార్వతీ గృహ నిర్మాణ విషయం చదివినవారికి గుర్తుంటుంది) విశ్వనగరం. మరల సంవత్సరం వచ్చేసరికి ఎంత విస్తరణ జరుగుతుందో!

(ఈ వ్యాసం 2007లో స్వామి జన్మదిన సందర్భంగా వ్రాసినది)

ఋషిగా మారిన కులపతి, కుర్తాళం పీఠాధిపతి

శ్రీశ్రీశ్రీ సిద్దేశ్వరానంద భారతిస్వామివారి సహస్ర చంద్ర దర్శన మహోత్సవం

సనాతన వేద ధర్మ రక్షణ కోసం, సర్వమానవ శ్రేయస్సు కోసం శ్రీశ్రీశ్రీ శివచిదానంద సరస్వతీస్వామివారు, వీరు మౌనస్వామిగా ప్రసిద్ధులు. తమిళనాడులోని కుర్తాళంలో సిద్దేశ్వరి పీఠాన్ని స్థాపించారు. ఈ పీఠం ప్రస్తుత పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సిద్దేశ్వరానంద భారతీస్వామివారి సహస్ర చంద్ర దర్శన మహోత్సవాన్ని జనవరి 18 నుండి 24 వరకు పీఠ శిష్యులు, వారి భక్తులు బహు గొప్పగా జరిపారు.

స్వామివారిని నేను నాన్నగారితో ఒకసారి గుంటూరులో వారి ఇంటిలో పూర్వాశ్రమంలో ఆయన ప్రసాదరాయ కులపతిగా వున్నప్పుడు కలవటం జరిగింది. మాట్లాడిన ఆ అరగంట ఆయన మాట్లాడిన మాటతీరు, ఆయన నోటి వెంట వెలువడిన మృదుమధుర పదగుంభనమైన తెలుగుభాష నన్ను బాగా ఆకట్టుకుంది. వారి భువన విజయం చూసే భాగ్యం నాకు కలుగలేదు కాని నాన్నగారు బహుగొప్పగా చెప్పగా విన్నాను. ఆయన్ను విశ్వగురు విశ్వంజీగారే వెళ్ళి చూడమని నాన్నగారిని, నన్ను పంపారు. తరువాతి కాలంలో ఆయనో పెద్ద యోగిపుంగవులతారని విశ్వంజీ గారు మమ్మల్ని ముందే ఆయన ఆశీర్వాదం తీసుకోమని పంపారా అని అనిపిస్తూంటుంది.

వారిది సౌజన్య హృదయం, ప్రసన్న హృదయం, సరళ స్వభావం, క్షమాగుణ సంపన్నులు క్షమ కలిగినవారి వద్ద సకల గుణములు వుంటాయని అంటూంటారు.

కవిగా, ఆశుకవిగా ఆయన కెన్నో బిరుదములున్నాయి. ఆయన ఒక్కటి కూడా ఆయన పేరు ముందు వేసుకున్నట్టుగా నే చూడలేదు. అంతటి నిరాడంబరులు.

ఆశుకవిత్వంతోపాటు ఆధ్యాత్మికతను పెంచుకున్నారు. అమ్మయొక్క అపార కరుణ పొందారు. 1937 సంవత్సరం జనవరి 27వ తేదీన గుంటూరు జిల్లా పల్చేరులో జన్మించారు. అవధాన విద్యలో వారికి వారే సాటి. ఎన్ని అవధానాలు చేసారో లెక్క తెలియదు కాని, లెక్కలేనన్ని చేసి వుంటారు. ఆయన సాత్విక మనసుకి తగినట్టుగా గాత్రం సొంపుగా ఉంటుంది.

చెన్నైలో మూడు రోజులపాటు ఆయన 'రాధా భాగవతాన్ని' ఏర్పాటు చేసే భాగ్యం మా ప్రముఖాంధ్రకు కలిగింది.

ఆ మూడు రోజులు ఆయన ప్రసంగం చెన్నైవాసులను మంత్రముగ్ధులను చేసింది. ఆయన మాటలలోని ఆ సరళత్వాన్ని నేను ఎవరి దగ్గరా చూడలేదు. వారిని మా ఇంటికి ఆహ్వానించి పాదపూజ చేసే భాగ్యం మాకు దక్కింది.

ఇంత గొప్ప మనస్సుగల వారు మౌనస్వామి, త్రివిక్రమరామానంద భారతీ స్వామి వంటి మహామహులు అధిష్టించిన సిద్దేశ్వరి పీఠాధిపతులు కావడం, ఆ పీఠాన్ని ఇంకా ఎక్కువగా ప్రచారంలోకి తెచ్చి దేశవిదేశాలలోని తెలుగువారందరూ గర్వించేటట్టు చెయ్యడం మనమెంతో గర్వించదగ్గ విషయం.

స్వామీజీ సహస్రచంద్ర దర్శన మహోత్సవ వేళ వారికి శిరస్సు వంచి నమస్కరిస్తూ, వారి కరుణ నాపై వర్షింపజేస్తూ, నాన్నగారి బాటలోనే నేను నడుస్తూ ప్రపంచ తెలుగు ప్రజలకు ఈ ప్రముఖాంధ్ర ద్వారా సేవచేసే అనుగ్రహం ప్రసాదింపచేస్తారని ఆశిస్తున్నాను. ●

తెలుగు జాతి మనది! నిండుగ వెలుగు జాతి మనది!!

ఈ ప్రపంచంలో ఎన్నో సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఉన్నాయి. అలాగే ఎన్నెన్నో విభిన్న భాషలు కూడా మాట్లాడబడుతున్నాయి. అదేవిధంగా మన దేశంలో కూడా విభిన్న సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఎన్నో భాషలు ఉన్నాయి. అంటే మన దేశం ఒక చిన్న ప్రపంచం లాంటిదని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు! మరొక చిత్రమేమిటంటే! మన ఆంధ్రరాష్ట్రంలో కూడా తెలుగే మాట్లాడబడుతున్నప్పటికీ, అది ఎన్నో రకాల మాండలికాలు, రకరకాల యాసలతో విరాజిల్లుతున్నది. తెలుగువారే అయినప్పటికీ వివిధరకాల ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, సంప్రదాయాలు కలవారుగా ఉన్నారు. అంటే మన ఆంధ్రరాష్ట్రం కూడా ఒక బుల్లి ప్రపంచం అనుకోవచ్చు.

అవును, ఆంధ్రరాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి ఒక్కోరకమైన భాష ఉన్నది. అలాగే ప్రతి ప్రాంతంలోనూ దాదాపుగా ఒక్కొక్క జిల్లాలో ఒక్కో రకంగా మాట్లాడబడుతున్నది మన తెలుగు భాష. అదెలా ఉన్నదో గమనిద్దాం. మొదట కోస్తా ప్రాంతంలోని నెల్లూరుని తీసుకుంటే అక్కడ కొంత తమిళయాస, రాయలసీమ భాష కలిస్తే, ప్రకాశం జిల్లాలో రాయలసీమలోని కడపయాస కొంత కలిసినట్లుంటుంది. అలాగే గుంటూరులోని కొంత ప్రాంతం ఒక రకంగా ఉండి కొంత ప్రాంతం కృష్ణా జిల్లాలోని విధంగా ఉండి తర్వాత గోదావరి యాసను సంతరించుకున్న మన తెలుగు భాష తూర్పు గోదావరిలో మరికొంచెం యాసతో ఉండి విశాఖపట్నం వచ్చేసరికి వేరొక రూపు సంతరించుకుని విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో తనదైన శైలితో అలరారుతోంది.

అలాగే రాయలసీమ విషయానికొస్తే నాలుగు జిల్లాల్లోనూ నాలుగు రకాల అందాలను సంతరించుకున్నది మన తెలుగు భాష. అనంతవరపు తెలుగు కన్నడ కస్తూరి వాసనలు నింపుకుని, చిత్తూరు తెలుగు తమిళ తళుకులద్దుకొని, కర్నూలు జిల్లాలో తెలంగాణా ప్రభావంతో వెలుగుతూ, కడపలో తనదైన విలక్షణ శైలిని సంతరించుకున్న మన తెలుగు భాష తెలంగాణాలో విభిన్నరీతులతో వీనులవిందు చేస్తోంది. కరీంనగర్‌లో అచ్చ తెలుగు సొబగులతో అలరారి ఓరుగల్లుతో జోరును సంతరించుకుని, ఖమ్మంలోనూ, నల్గొండలోనూ కొంత కోస్తా వాసనలతో సుగంధాలీనుతూ పాలమూరు జిల్లాలో పాలుకారు మన తెలుగు భాష మెదక్‌లో విలక్షణంగా వెలుగుతూ, నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాలో మరాఠా మాధుర్యాన్ని సంతరించుకొని, ఇక రాజధానియైన హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలలో అన్ని రకాల సొబగులను రంగరించుకున్న మన తెలుగు భాష విభిన్న రీతులలో విరాజిల్లుతున్నది.

ఆంధ్ర రాష్ట్రంలోనే కాదు, మహారాష్ట్రలోని ఎన్నో ప్రాంతాలలో తెలుగు ప్రజలు నివసిస్తూ ఆయా ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. అలాగే కర్ణాటకలోని ఎన్నో ప్రాంతాలలో తెలుగు ప్రజలు నివసిస్తూ ఆయా ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. అలాగే కర్నాటకలోని ఎన్నో ప్రాంతాలలో తెలుగువారు అధికంగా ఉండి అలరారుతున్నారు. అలాగే ఒరిస్సాలోని బరంపురం మొదలైన ప్రాంతాలలోనూ, ఛత్తీస్‌గఢ్ దక్షిణ ప్రాంతాలలోనూ తెలుగువారు తమ ఉనికిని కలిగి ఉన్నారు. రాష్ట్రంలోనైతేనేమి, దేశంలోనైతేనేమి, విదేశాలలోనైతేనేమి, ఎన్నో రకాలుగా మన తెలుగు భాష భాసిల్లుతున్నది.

చెప్పొచ్చేదేమిటంటే, ఏ ప్రాంతానికి చెందినా, ఏవిధంగా ఉన్నా, ఏ మాండలికంలో ఉన్నా, ఏ యాసతో ఉన్నా, ఏ భాష ప్రభావం పడినా, తెలుగు భాష తెలుగు భాషే. అసలు ఇన్ని రూపాలు మన తెలుగు భాషకు కలగటం వలన మన పద సంపద అపారమైనదిగా ఉన్నది. ఒక రకంగా అందుకు మనం గర్వపడాలి. అయితే, దేశంలో కానీ విదేశాలలో కానీ, కొందరు తెలుగువారు తాము మాట్లాడే భాషను (యాస లేదా మాండలికం) బయట అంటే బహిరంగంగా మాట్లాడటానికి జంకుతారు. ఇది కూడదు. అదేవిధంగా ఎవ్వరూ కూడా ఒక ప్రాంతపు తెలుగును అపహాస్యం చేయకూడదు. ఆంధ్రప్రదేశ్‌లోని వేర్వేరు ప్రాంతాలలో విభిన్న రీతుల్లో ఉన్న తెలుగు భాష, చెన్నై, బెంగుళూరు, బళ్ళారి, బరంపురం, బస్తర్ మొదలైన ప్రాంతాలలో, ఆయా స్థానిక భాషల ప్రభావం వలన పదాలు, ఉచ్చారణలో వైవిధ్యం ఉన్న మన తెలుగు భాష యొక్క ఆత్మ ఒక్కటే! (మాండలికాలతో పారిభాషిక పదాలను తేలికగా రూపొందించవచ్చు. దానివలన మనం విదేశీ అన్య భాషా పదాలను ఉపయోగం తక్కువగా చేసుకోవచ్చు. మన పద సందప తరగకుండా ఉంటుంది).

కాబట్టి ఆంధ్ర రాష్ట్రంలోని వారు, ప్రవాసాంధ్రులు, తెలుగువారెవరైనా, ఎక్కడ వున్నా, వారి మాతృభాషలో నిర్భయంగా, హాయిగా, నిండుగా మాట్లాడితేనే ప్రతి యాసవారు ఇతరుల యాసను గౌరవిస్తేనే, ఎక్కడైనా, ఎప్పుడైనా, మన తెలుగు వెలుగుతూనే ఉంటుంది. వెలుగులు పంచుతూనే ఉంటుంది. తెలుగువారి ఐక్యతను ఎలుగెత్తి చాటుదాం! మనమంతా ఒక్కటేనని నినదిద్దాం!! సకలాంధ్ర జనాస్సుఖినో భవంతు!!!

– పోపూరి విశ్వనాథ్

ఆంధ్రలో తొలి ఆకాశవాణి కేంద్రం విజయవాడే!

విజయవాడకు ఆంధ్ర రాజధానీ కావలసిన అర్హతలన్నీ ఉన్నాయ్. దేశంలోని అనేక నగరాలను కలుపుతూ రవాణా సౌకర్యం వుంది, ఒక రకంగా ఆంధ్ర నడిబొడ్డున, కృష్ణానది ఒడ్డున, కనకదుర్గమ్మ ఒడిలో ఉన్న పట్టణం విజయవాడ.

ఈ విషయాన్నెరిగినందువల్లనో ఏమో, దేశ స్వాతంత్ర్యం సిద్ధించిన 16 మాసాలకు అనగా 1948 సం॥ డిసెంబర్ 1న విజయవాడలో తొలి ఆకాశవాణి కేంద్రాన్ని నెలకొల్పారు. అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర రెవెన్యూ మంత్రి, ప్రముఖాంధ్ర కాంగ్రెస్ నాయకుడైన కళా వెంకట్రావు గారి కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రారంభ ప్రసార శక్తి 1 కిలో వాట్ మాత్రమే! ఇప్పుడా కేంద్రం 100 కిలోవాట్లకు పెరిగింది.

ముఖ్యవిశేషమేమన – ఈ కేంద్రం భక్తిరంజని కార్యక్రమాలకు ప్రసిద్ధి చెందింది. కర్ణాటక, లలిత, హిందూస్తానీ సంగీతానికీ, సాంప్రదాయ సాహిత్యానికీ ఎంతో పేరు తెచ్చింది. వేకువనే లేచి రేడియోను ట్యూను చేసేసరికి మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి, ఓలేటి వెంకటేశ్వర్లో, సల్లాన్ చక్రవర్తులవారో, శ్రీరంగం గోపాలరత్నం గారల గాత్రరంజనో వినిపించేది. విశ్వనాధ కవిరాజు గారి శ్రావ్యనాటిక, 'నండూరి వారి ఎంకి పాటలు – ఇలా ఇలా తెలుగు సాంప్రదాయ, సాహిత్య, సాంస్కృతికపరమైన లలిత కళల సొంపు వినసొంపుగా వినిపిస్తూ, వీనుల విందొనరిస్తుంటుంది.

ఇహ శ్రీరామనవమి వచ్చిందంటే చాలు – భద్రాచల సీతారాముల వారి కళ్యాణ శోభ వ్యాఖ్యానం వీనులకే విందుయైనప్పటికినీ, కనుసందుల్నుంచీ ఆనందభాష్పాల్ని కూర్చేది విజయవాడ ఆకాశవాణి కేంద్రమే. జమ్మలమడక మాధవరాయ శర్మగారనుకుంటానూ 'రామభద్రా! సీతమ్మతల్లి మెడలో ముడి వెయ్యి, ముడిమీద ముడి వెయ్యి' అంటూ వరుణ్ణి ఉత్సాహపరుస్తూ, అమ్మా సీతమ్మ తల్లీ తలంబ్రాలు పొయ్యి తల్లీ – సిగ్గులొలుకు సీతమ్మ తల్లీ' అంటూ చెప్పే తీరు, బాలల కార్యక్రమంలో ఏడిద కామేశ్వరరావు గారు ఇతరంగా గొల్లపూడి మారుతీరావు, శంకరమంచి సత్యం వంటి వారెందరో ఈ కేంద్రాన్ని కేంద్రంగా చేసుకుని పైకి వచ్చినవారే! అన్నిటికన్నా ఉషశ్రీగారి ప్రవచనాలు, సంగీత పాఠం, సంస్కృత పాఠం, పౌరాణిక నాటకాలు, అన్నిటి ప్రభావాన్నీ చూపించిన విజయవాడ ఆకాశవాణి కేంద్రమా నా బాల్యంలో వినిపించినవన్నీ వీణాధ్వనులేనమ్మా!

వైఖానస ప్రభావికులు
దీవి విఖనసాచార్యులు

'జాతస్య మరణం ధృవమ్' అంటారు. కొంతమందికి మరణమే ఉండదు. గంధపు చెట్లు నేలకూలినప్పటికినీ దాని పరిమళం ఆ నేలనంతటనూ నింపి వేస్తుంది, దాని భస్మం సహితమూ విస్తరించి, సౌగంధికా పరిమళాన్ని గుభాళింపచేస్తుంది. మంచివారు కాలం చేసినప్పటికినీ వారు చేసిన పనులు కలకాలమూ నిలిచిపోతుంటా యనడానికి తిరుమలలో వాసిగొన్నవాసి శ్రీమాన్ దేవి విఖనసాచార్యులు వారే నిదర్శనం.

డి.వి. చారిగా ఖ్యాతిగొన్న శ్రీమాన్ దీవి విఖనసాచార్యులు గారి జీవితము అలాటి సుగంధ దివ్య పరిమళాన్నే వెదజల్లింది. మనిషి ఎంతకాలం జీవించారని కాదు, మనిషి ఎంతటి మంచి పనులు చేశారన్నది ముఖ్యం. అలాటి ముఖ్యతనూ, ముక్తినీ పొందిన తిరుమల యశోనిధీ వైఖానస సారధియైన దీవి విఖనసాచార్యులు వారి 69 సం॥ముల జీవితం చతుర్విధ సమారోహంగా జరిగింది. మహనీయుడైన మనిషి చేయవలసిన భగవత్సేవ, ఆచార్యసేవ, సంఘసేవ, సారస్వత సేవల్ని సంపూర్ణంగా చేసి, చేయుటకు ఏఁవీ శేషించలేదని 2001 సం॥ము మార్చి 4న భగవత్సాన్నిధ్యం పొందిన దీవి విఖనసాచార్యులు వారిని సంస్మరించుకోవడం అవసరమనిపించింది. పవిత్రమైన శ్రీవారి క్షేత్రం తిరుమలలో వారు నిర్మింపచేసిన శ్రీ విఖనసాశ్రయ నూతన భవనం, శ్రీ వైఖనస ప్రభ ధార్మిక పత్రిక, శ్రీ వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధినీ సభ, శ్రీ విఖానస ట్రస్టు, శ్రీ వైఖానస ఆగమ సిద్ధాంత గ్రంథములను చూస్తున్నప్పుడు శ్రీ విఖనస ఆచార్యులు వారి అమేయ, అద్భుత, అకుంఠిత కృషి చెప్పకనే చెబుతుంది.

వృత్తిరీత్యా ఆయన ఇంజనీరు. తిరుమల తిరుపతి దేవస్థానములలో 36 సం॥ములు పనిచేసి ఎందరెందరో మన్ననలంది, పదవీ విరమణానంతరం కూడా వారి పెదవులపై నిలిచిన మహా మనిషి. తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమములు చేపట్టి, పాలకవర్గంలోని అప్పటి చెలికాని అన్నారావు, నాగిరెడ్డి, చంద్రమౌళి రెడ్డి, పి.వి.ఆర్.కె. ప్రసాద్ వంటి వారల మన్ననల్ను కోకొల్లలుగా అందుకున్నారు. పదవీ విరమణానంతరం కూడా తిరుమల తిరుపతి దేవస్థానముల ఇంజనీరింగు శాఖలో వారి విలువ తగ్గలేదు. సరికదా, అవసరమేర్పడినప్పుడు వారి సలహాలను తీసుకుంటూనే ఉండేవారు.

వైఖానసుడు గానీ, ఆ శాఖగానీ సామాన్యమైనది కాదు. "వైఖానస ఋషేః పూర్వం విష్ణోర్వాణీ సముద్భవేత్" అన్నారు. వేదములు ప్రారంభంలో వైఖానస ఋషికి ఉపదేశింపబడినవట. భగవానుడు బ్రహ్మను సృజించి వేదములుపదేశించా డట. దీన్ని బట్టి బ్రహ్మయే వైఖానసుడని భావింపవలసి వున్నది. 'వైఖానస్యామ గాయనః' అని వేదమయుడగు తేజ స్వరూపుడు వైఖానసుడు. భగవంతుని దివ్య సహస్ర నామముల్లో 'వైఖానసుడ'ని నారాయణున్ని కీర్తించినట్లు భారత వచనం ఉన్నది. అలాటి వైఖానస శాఖలో జన్మించి, వైఖానస శబ్ద అర్థ ప్రాచుర్యానికి విఖనసాచార్యులవారు అనంతమైన కృషి చేసి తన, తన వంశంవారిని సార్థకుల్ని చేశారు.

'కర్మణ్య కర్మయః పశ్యేదకర్మణి, చకర్మయః సబుద్ధి యేస్మనుష్యేషు సయుక్తః కృత్స్న కర్మ కృతే' అన్నట్లు కర్మయందు జ్ఞాన బుద్ధినీ, జ్ఞానమందు కర్మబుద్ధిని కలిగి కర్మనాచరించువాడే మోక్షార్హుడగుచున్నాడను గీతాచార్య సిద్ధాంతం ప్రకారం జీవిత పథంలో పయనించినవారే విఖనసాచాఋ్యులు. ఉద్యోగ ధర్మంతో పాటు ఉత్తమమైన మనుజ జన్మను సార్థక మొనర్చుకున్నవారాయన. అందుకే 'తిరుమల తిరుపతిల్లో వైఖానస శాఖల్లో, వైఖానస ధర్మానుష్ఠానంలో ఆయన పేరు చిరస్మరణీ యంగా నిలిచిపోయింది.

తిరుమల తిరుపతి దేవస్థానముల్లో ఎగ్జిక్యూటివవ్ ఇంజనీర్‌గా ఎన్నిటికో ప్లానులు తయారుచేశారు, ఎన్నో నిర్మాణముల్ను చేశారు, ఎందరికో ఉపాధి కల్పించారు, ఎందరికో శిక్షణ నిచ్చారు. శ్రీవారి ప్రజ్ఞా ప్రాభవ, విభవ, మహాత్మ్యములను తన రచనల ద్వారా జనముల కెరుకపరిచారు. ఇహ వైఖానస గ్రంథ సాహిత్యమును గూర్చి చెప్పనే పనిలేదు. 'వైకానస ప్రభ' పత్రిక ద్వారా కూడా సాహితీ సేవ చేసిన సుజనమనోహరమందారుడాయన.

ఆయన మోములో, పాపిటకు దిగువగా నాసికకు ఎగువగా ఆ నామము మధ్య నిలిచినట్లుగానే ఆయన ఆధ్మాత్మిక పరమైన, ఆధి భౌతికమైన రెండు ధర్మాలనూ తన జీవిత కాలంలో నిర్వర్తించారు.

జన్మించినది కృష్ణాజిల్లా ఆవనిగడ్డ. జననీ జనకులు అనంతలక్ష్మి లక్ష్మీ నరసింహాచార్యులు. తండ్రి గారు కూడా పూజారిగా ఉంటూ గీతోపన్యాసాలు యిచ్చేవారు. వైద్యం చేస్తూ ఊరిలో వారికి తలలోని నాలుకగా ఉండేవారు. తన కుమార్డు విఖనసాచార్యులు ఇంజనీరే కావాలని తాను జంధ్యములు వడికి అమ్మిన డబ్బులు, భార్య నగలను అమ్మి, దగ్గరలో నున్న ఉయ్యూరులోని పాలిటెక్నిక్ కాలేజీలో సివిల్ ఇంజనీరింగులో చేర్పించారు. తండ్రి ఆశించిన ప్రకారం ఆయన ఆ ఇంజనీరింగు నందు ఉత్తీర్ణుడై తిరుపతి పురపాలక సంఘంలో వర్కు ఇనస్పెక్టర్‌గా పనిచేశారు. అటుతరువాత ఆయన తిరుమల తిరుపతి దేవస్థానముల సూపర్‌వైజర్‌గా చేరి తన సామర్థ్యంతో, చిత్తశుద్ధితో, అంచెలంచెలుగా ఎదిగి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పదవిని చేపట్టారు. అలా 36 సం॥ముల్లో ఎన్నో అభివృద్ధి పనులు, కట్టడ నిర్మాణములను చేసి, 1990లో పదవీ విరమణను చేశారు. పదవీ విరమణ చేసిననూ తిరుమల తిరుపతి దేవస్థానము పనుల్లో సలహాలు ఇస్తూనే ఉన్నారు.

తాను జన్మించిన వైఖానస శాఖ కోసం, వైఖానస ఆశ్రమ నిర్మాణం విషయంలోనూ, ఆ శాఖా సంబంధిత సభ విషయంలోనూ, పత్రిక విషయంలోనూ, గ్రంథ ప్రచురణ, రచన, వ్యాప్తి ప్రచారం విషయంలోనూ ఆయన అమేయ కృషి చేశారు. 2001 సం॥ము మార్చి 4న సంభవించిన వారి మరణం వైఖానస శాఖ వారినీ, ఆధ్యాత్మిక తత్పరులనూ అమితంగా శోకతప్తుల్ని చేసింది. ఆయన మరణించినప్పటికినీ, ఆయన స్మృతా చిహ్నంగా ఆశ్రమ భవనాలు, దివ్య సిద్ధాన్త వివర్ధినీ సభ, వైఖానస గ్రంథమాల, వైఖానస ప్రభ, పత్రిక ఇత్యాదులు వారి స్మృతి చిహ్నంగా, వారింకా సజీవులేనన్నట్టు తెలియచెబుతున్నాయ్. మంచి మనసుకు మరణం లేదనిపిస్తున్నాయ్.

(ఈ వ్యాసానికి మూలం, సమగ్ర సమాచారం అందించిన డి. రాంబాబు గారికి కృతజ్ఞతలు)

ప్రేమలు పూచే సీమల లోపల వలపులు పారే సెలయేరులలో...

ప్రేమ అనెడిది పవిత్రమైనది. అగ్ని సాక్షిగా పెళ్లాడిన తరువాత ఉత్పన్నమయ్యే ఆలుమగల ప్రేమ అతి పవిత్రమైనదంటారు. ఎన్ని కష్ట నష్టాలు వచ్చినా, ఈతిబాధలెదురైనా ఆ ప్రేమకు చిలుము పట్టదు. అలాగే హృదయాలలో ఉదయ చంద్రుని చలువ కిరణాల్లో చిన్న చిన్న సెలయేరులుగా పుట్టి, వాగులై, నదులుగ పారి, అవగాహనం పెరిగిన సమ్మతం ఇరువురి అనుబంధం, మూడు ముళ్ల బంధంతో నిలుస్తుంది.

అంతేతక్క, ఇదేంవి పోయే కాలమో ప్రేమికుల రోజు (వాలెంటైన్ డే) అంటూ ఆరోజు, చెట్టులా పుట్టలా గుట్టలా, రోడ్డులా, ఇసుక తిన్నెల్లోనూ తిరుగుతూ, అరకొరా దుస్తులతో గంతులేసేది ప్రేమ అనిపించుకోదు. ఈ జాఢ్యం పాశ్చాత్య దేశాలది. ఎంత త్వరగా ప్రేమించుకుంటారో, అంత త్వరగా విడిపోతారు. మరి ఇలా పిచ్చి పిచ్చిగా వ్యవహరించేది మన సాంప్ర దాయమా, చట్టుబండలా!

దీన్ని పత్రికలూ, టీవీ మాధ్యమం, గ్రీటింగ్ కార్డుల వారు, విపరీతమైన ప్రచారం యిచ్చి, యువలోకాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు.

పవిత్రమైన ప్రేమకు అర్పితమైన నాయకీ నాయకులున్నారు. ఏళ్ల తరబడి నిరీక్షించిన ప్రేమీ ప్రేమికుల చరితలున్నాయ్. ప్రేమ ఫలించకపోతే భగ్నప్రేమతో కుమిలినవారున్నారు. రాజ్యాలు త్యజించినవారున్నారు.

సువిఖ్యాత కవీంద్రుడు శేషేంద్రశర్మ ప్రేమపై ఎన్నో రచనలు చేశారు. హృదయ ఉత్పన్నతను తెలియచేశారు. రాజులు నగరాల్ని పాలించినట్లు, గాలి తోటలను పాలిస్తుం దన్నారు. అలాగే నీవు నా ఊహల్ని పాలిస్తూన్నావన్నారు. సూర్యకాంతులెలా అస్తమిస్తాయోగానీ నీ కన్నుల్లో కాంతులు అస్తమించవు. నీవే నాకొక దేవత. శరీరంలో ఎన్ని నక్షత్ర మండలాలున్నాయో ఎన్ని శ్వేత ఐరావత కుటుంబాలున్నాయో, ఎన్ని కోకిలల, ఎన్ని గులాబీ తోటలున్నాయో చూపించావు.

బాపూ రమణలు ఆయన్ను పిలిపించి ఓ సినిమాలో పాట కూడా వ్రాయించారు. 'నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది' అనే రసవంతమైన పాటను శేషేంద్రశర్మ వ్రాశారు. ఆయన వచనం కూడా గేయంలా, మధురంగా ఉంటుంది. మానసిక గాయాల్ను మ్రాన్పుతుంది.

పూలగాలి నా గదిలోనికి ప్రవేశించింది. దానిలో తేలుతూ తేలుతూ నా ఊహల కిటికీలో నుంచి ఎగిరిపోయింది. నా కలల్లో నీ మందహాసాల మందల్ని తోలుకుపోతున్న బాలుణ్ణిగా మారిపోయాను.

నీ కన్నుల్లో సముద్రాలే కదుల్తాయ్. పసిపిల్లలా నీ ఒక్క మాటలోనే ఒదిగిపడు కుంటాయ్. మనిషి నిర్మించిన ప్రేమ గాథల లైబ్రరీలన్నీ నీ ఊహల్లో కిరీటాలు ధరించిన రాజులు కూడా తలవంచి నడిచిపోతారు తమ పరిపాలన సాగని వీధుల్లో నడుస్తున్నట్టు.

నిన్ను ఒక్కదాన్నే ప్రేమిస్తా! చిన్నప్పుడు కాశీ మజిలీ కథల్లో నుంచీ అరేబియన్ నైట్స్ కథల్లో నుంచీ నా చైతన్య సీమల్లోకి దిగిన రాజకుమార్తె లందరూ నీవొక్కతేవే అయినట్లు ప్రేమిస్తా.

ఎంత బాగుందండీ ఈ పదజాలం, ఏ దివిలో విరిసిన పారిజాతమో అన్న ట్టుంది కదా. ప్రేమన్నా, ప్రేమ భావన అన్నా అదే.

ఇహ ఆయన రసమాధురీ గేయంలోకి పోదాం:

నీ సృజనాత్మక లోకాల్ని
నా ప్రేయసి మేల్కొలిపింది
ఆ మేలుకున్న అంతర్లోకాలు పూస్తున్న పరిమళాలే!
ఈ నాటి గాలుల్లో కలిసి వ్యాపిస్తున్నాయి.
నా ప్రేమ రాజకుమారీ, నీ ఉత్తరాలు విప్పాను.
పేజీల్లోంచి వెన్నెల రాలినది.
నీవు స్త్రీవి కావు అందాల తుఫానువి
అందరి భాషా కంఠంలో నుంచీ వస్తే... నీ
భాష కన్నుల్లో నుంచి వస్తుంది, నీవు హృద
యాన్ని అక్షరాల్లో పెట్టిన పక్షివి.
నీ సాయంకాలాల్ని అందంగా మలుద్దామని
ఒక ముద్దు యిస్తే అది నీ గుండెలో తుఫానుగా మారుతుందనుకోలేదు.
ప్రేమకు దానికోసం ఎత బాధయినా పడదగి
నంత విలువుంది; అందుకే నేను ఇవాళ
ఒంటరిగా ఈ వంతెన మీద కూర్చుని... నా
మీద చంద్రుడి చేత వెన్నెల కురిపించుకుం
టున్నా... పారిపోతున్న ప్రవాహాన్ని చూస్తూ...
ఎవడో రుషి చెప్పాడని
ఎందుకు తుంచేస్తావ్ ప్రేమని
నీ రక్తం పారబోసి నింపుకోకు కమండల జలం
బ్రతుకు అనే ఒక గ్లాసెడు మధువును మహా
సముద్రమని వాడంటే...
నీవు నీ గడ్డంతో సహితం దూకు అందులో
అని చెప్పు.

గీతం పాడినట్టుంది. హృదయాన్ని స్పందింపచేసే ఆయన పదసముచ్ఛయం చూడండి.

ముద్దబంతి పూవులు గుచ్చిన మోదపు పూదండగా ఉంటుంది. ఆ పువ్వు వాడదం అంటూ ఉండదుకా!

ఇలాటి జాణ తెలుగు కవిత్వం కల కవిత ఆయనిదే! ●

తెలుగు పద్యం పండితుల కొరకేనా - పద్యం పామరుల కర్థం కావాలి కదా!

తెలుగు పద్యం బాగా చదువుకున్నవారికీ, పండితులకూ, గురువర్యులకూ తక్క ఇతరులకు అర్థం కాదనే అపప్రద ఉన్నది. సులభగ్రాహ్యమైన, సరళపదజాలంతో, సుగుణదీప్తికమౌ నీతిశతక పద్యాలున్నప్పటికినీ – ఈ అపప్రద ఎందుకో తొలగలేదు. అలాటివారిలో వేమన, సుమతి, కుమార, కృష్ణ శతకాల జోలికి పోయిన వారెవరూ లేరు. తిరుపతి వేంకట కవుల 'పాండవోద్యోగ విజయాలు' (కురుక్షేత్రం) నాటకం పద్యప్రభావం కోసమే పుట్టింది. నేటికీ జనం ఆ పద్యాల కోసమే ఆ నాటకాన్ని చూస్తున్నారు, వేసేవారు వేస్తున్నారు. అయితే నాటకంలో ఉన్న 300 పద్యాలు పాడి ఆ నాటకాన్ని ప్రదర్శించేవారు లేరు, ఓపిక చేసుకుని అన్ని పద్యాలు వింటూ నాటకాన్ని చూచేవారు అంతకన్నా లేరు.

పామర భాషలో కూడా పద్యాలున్నాయ్!

ఈమధ్య ప్రాచీన కవుల పద్యాలను వెదుకుతూంటే పామరులకు అర్థమయ్యే ఆ భాషలోనే పద్యం వ్రాసిన ఓ కవి పద్యం కనిపించింది!

గుడగుడనీరు తాగుతది
గుప్పున ఊత్తది, దాని తోకలో
ముడుసులు గూకుతారు బవుమంతది
బేగి లగెత్తుతాది బల్లుడుకున లాగుతాది.

– అంటూ ఆ కవిగారు వ్రాసిన పద్యం ఒకరి నోట విన్నాను. ఇంతకీ ఏం విటా పద్యభావం, దేనిగురించి వ్రాసా రయ్యా అంటే – ఆనాడు కొత్తగా ఇనుప పట్టాలమీద కొచ్చిన పొగరైలు బండి గురించీ, శుద్ధ గ్రామ్యంలో పామరులైన గ్రామీణులనుద్దేశించి వ్రాసిన పద్యమిది.

ఇంటిసుట్టు వలనేత్తరు, సూత్తరు
వంక దణ్ణముల్ పెడతరు, మేలు సే
స్తమని పెగ్గెల బల్కుతరు పనైన ఎంబడి
తిరిగైన సూడరిసుమంటి ప్రబుద్ధులు
రాజ్యమేలితే కుడిసికు కుండసిస్త
మొగుండ్లయి సూస్తనె గొంతు గోయరా

– ఇలా ఆయన రాయలసీమ మాండలికంలో పద్యాలు చెప్పేవారట. జనం ఇరగబడి సూసేవోరట అన్నాడాయన. ఆయన 'వినోదావధానం' అనే విచిత్రవధానాన్ని పల్లె పల్లెనా గ్రామ గ్రామాన్ని చేసేవారట. ఇప్పటి అవధానాల్లా ఆ అవధానానికి పృచ్ఛకులు అంటూ ఉండేవారు కారట. ఎదురుగా శ్రోతలుగా కూర్చున్నవారే నోటిమాటగా, చీటీలో వ్రాసియిచ్చి సమస్యలు చెప్పేవారట. ఆయన పామరమాండలీకంలోనే ఆశువుగా పద్యములు కూర్చి చెప్పేవారట.

ఇంతకీ ఆ కవిగారి పేరేంవిటయ్యా అని అడిగితే – నేనూ ఓ పత్రికలో చదివిన గుర్తండీ, ఆ కవిగారి పేరు 'మద్దులపల్లి వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి' గారటండీ అన్నారు. తరువాత నేనే కొన్ని వివరాలు సేకరించాను.

ఆయన 20వ శతాబ్ది ఆరంభపు కవియనీ, నెల్లూరులో పుట్టి, నంద్యాలలో కాలం గడిపారనీ, 74 సం॥ముల పాటు జీవించారనీ విషయ సేకరణ చేశాను. మహా పండితుడై నప్పటికినీ, సామాన్యుణ్ణి దృష్టిలో పెట్టుకుని వారికి అవగాహన మయ్యేట్టు కవితలల్లేవారని, మానవత మూర్తీభవించిన మహా మనిషియని విన్నాను. బడుగువర్గాల వారిపై వారికి వాత్సల్యం అధికం. వారిలో మాతృభాషా ఉత్సుకత కల్పించాలని చేసిన అనన్య కృషే ఆయన రచనలు.

ఆంధ్ర వచన భారతం, చతుర్దశమనుచరిత్ర, మానవుడు, గోసేవ, బ్రహ్మస్వామి జీవితం – ఇటువంటి గ్రంధాలే వారి రచనలు. అధ్యాపక వృత్తిని చేస్తూ, పిల్లల దృష్టిని తెలుగుపై నిలుపుతూ, ఇంట్లో ఉన్నప్పుడు అతిధులతో సాహితీ చర్చలు జరిపేవారట. రోజుకు ఒక్క అతిధికైనా ఇంట భోజనం పెట్టకుండా ఆయన భుజించే వారు కాదని చెబుతారు. ఆ బడి పంతులు ఉద్యోగంలోనే అనాధల్ని సహితమూ ఆదరించేవారనీ, అప్పుడప్పుడు అడిగినప్పుడు వారికి ద్రవ్యం యిస్తుండేవారట. 'మహిషశతకం' అనే వ్యంగాత్మక శతకాన్ని రచించారు. రాజకీయ నాయకులపై వ్యంగ్యాస్త్రములు సంధించారు.

ఆయన వ్రాసిన సత్యనారాయణ మహత్త్యం గ్రంధాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు 1934 సం॥ములో పాఠ్యాంశంగా చేశారని కూడా తెలుస్తూంది.

సీతారామ కళ్యాణం ఇతివృత్తంగా చేసుకుని 'పెండ్లి రాయబారం' అనే పుస్తకాన్ని తేటగీతుల్లో వ్రాస్తూ 'సకల సద్గుణోపేత మా జనకజాత' యంటూ తన ఇరవైయేడేండ్ల వయసులోనే హృద్యమైన గ్రంథం వ్రాశారు, ఆ వయసులోనే కాశీ, రామేశ్వర యాత్రలను చేశారు. 1941 సం॥ములో తెలుగునాట, 1943 సం॥ములో బెంగాల్ నాట తీవ్ర కరువు పరిస్థితులు నెలకొనడం, ఆ ఇతివృత్తంలో ఆయన 'అమృత సందేశం' కావ్యం వ్రాయడమూ జరిగింది. సంస్కృతాంధ్ర భాషల్లో అత్యున్నతమైన పాండిత్యం ఉండీ, పామర జనాభి మానం కోసం, మాతృభాషాభిమానంతో, మాతృసేవాదీక్షతో పామర సాహిత్యాన్ని కొనసాగించిన కవి సుబ్రహ్మణ్యశాస్త్రికి జేజేలు!

Compliments from
Sri Krishna Bhat
When you come to Holy Pilgrimage Centre Tirupati & Tirumala
WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
WOODSIDE
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464

తెలుగు వెలుగు గోటేటి శ్రీరామారావుకు అశ్రునివాళి



ఆధ్యాత్మిక భావం ఎదనిండేలా ప్రతినెలా ప్రముఖాంధ్ర అట్టమీద దైవదర్శనం –అది గోటేటి శ్రీరామారావుగారి ప్రత్యేక ముద్ర. ఈ 2018 డిసెంబరు సంచికపై దైవసన్నిధికి చేరిన ఆయన బొమ్మ – దిగ్భ్రాంతికి లోనైనాము. గోటేటివారి మూర్తిమత్వం, వారికి తెలుగంటే, మన తెలుగంటే ఎంత ఇష్టమో వారి ప్రతి అక్షరంలో వ్యక్తం చేసే ప్రేమ, నిరాదరణకులోనై తక్కువ కాకూడదనే ఆవేదన తెలుగు నేలకు దూరంగా చెన్నైలో ఉండి ప్రసరించే వెలుగులు తెలుగువారైన ప్రతి ఒక్కరినీ ఆలోచింపచేస్తాయి. శ్రీరామారావుగారి మహోన్నత వ్యక్తిత్వం, వారి మంచితనం ఆయనతో కొద్ది పరిచయమున్న వారికైనా తెలుసు. 24 సంవత్సరాలు నిరంతరాయంగా ఒక పత్రిక నిర్వహించడం మామూలు విషయం కాదు.

ఎన్ని ఒడిదుడుకులెదురైనా, రచయితలను ప్రోత్సహిస్తూ, క్రమం తప్పకుండా పత్రికను నడపడం ఆయన పట్టుదలకు, శ్రమకు తార్కాణం. శ్రీరామారావుగారి నిష్క్రమణ వారి కుటుంబానికే కాక తెలుగువారందరికీ తీరని లోటు. దీర్ఘ కాలంగా సాంస్కృతిక రంగంలో నేను నిర్వహిస్తున్న కార్యక్రమాలను వేగేశ్న ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు 30 ఏళ్ళుగా నేను చేస్తున్న సేవను వారు అభినందించడం గుర్తుకు వస్తున్నది. ఆయన ఆత్మీయమైన పలకరింపు పదేపదే గుర్తుకు వస్తున్నది. తెలుగు భాషకు, సాహిత్యానికి ప్రముఖాంధ్ర ద్వారా చేసిన సేవ కలకాలం నిలిచి ఉంటుంది. ఆయన వారసత్వాన్ని ఆనందంగా స్వీకరించిన ప్రముఖాంధ్ర పత్రిక కొనసాగింపుకు పూనుకుని ప్రారంభించిన గోటేటి వెంకటేశ్వరరావుగారికి తన కర్తవ్యం పట్లగ నిబద్ధతకు అభినందనలు. కుటుంబ సభ్యులకు వంశీ– వేగేశ్న సంస్థల తరపున సంతాపం తెలియచేస్తూ... శ్రీరామారావుగారికి అశ్రునివాళి.

'కళాబ్రహ్మ', 'శిరోమణి' **డా॥ వంశీ రామరాజు**
వ్యవస్థాపకులు, వంశీ – వేగేశ్న సంస్థలు
డా॥ తెన్నేటి సుధాదేవి, అధ్యక్షురాలు, వంశీ

జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

"మానవుడు ఎంత గొప్పవాడైతే, అంత కఠినమైన పరీక్షలను దాటవలసి వుంటుంది."

- స్వామి వివేకానంద

నా జీవన హీరో

Every father is a hero to his son అంటారు. అవును మా నాన్నగారు నాకు హీరో. మార్చి 7 ఆయన పుట్టినరోజు. ఆయన పుట్టినరోజును వేడుకగా జరుపుకోవడం ఆయనకు అలవాటు. గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యరీత్యా అలా జరుపుకోలేకపోయినా ఇంట్లో మేమందరూ ఆయన్ని తీసుకుని గుడికి వెళ్లడం. ఇంట్లో కొన్ని పిండివంటలు చెయ్యడం, మనవలు, మనవరాళ్ళు ఆయనచేత కేక్‌కట్ చేయించడం, జరుగుతూ వుంది. ఆయనకదో తృప్తి. ప్రత్యేంగా కొత్త దుస్తులు ఎలా కావాలో చెపుతారు. అలా తెప్పించుకుంటారు. ఆయనకు చాలా ఆత్మీయులైన స్నేహితులు ఇద్దరు ముగ్గురు ఇంటికి రావడం లేదా వారు మరచిపోయినా, వారిని ఫోన్ చేసి రప్పించడం జరుగుతూ వుంటుంది. ఈ తతంగం అంతా ఆయనకో సరదా. కాని ఈ సంవత్సరం ఆయన లేకపోవడం మాకు బాధాకరం. ఇంటిలో పిల్లల నుండి పెద్దల వరకు ఆయన్ను తలుచుకోనివారు లేరు. చాలా వెలితిగా అనిపిస్తోంది. ప్రతివారిని ఆయన పలకరించే ఆ తీరే అందరిచేత ఆయన్ను సదా తలపిస్తోంది. 2003లో అమ్మ పోయాక ప్రతి సంవత్సరం అమ్మను తలచుకుంటూ ఏప్రిల్ నెలలో నాలుగు ముక్కలు రాస్తూ వుంటాను. అది చూసి ఆయన నవ్వుతూ అమ్మంటేనే నీకిష్టంరా అంటూంటారు. కాని ఈ పేజీల్లో ఈ నాలుగు ముక్కలు రాస్తూ ఎలా బాధపడ్డానో ఎన్ని కన్నీళ్లు కార్చానో భగవంతుడికే తెలుసు. అవును ఆయన లేకుండా చాలా కష్టంగా వుంది. ఆయనకు ఆరోగ్యం బాగాలేక పోయినా, నావెనుక కొండంత అండగా ఆయన వున్నారనే భరోసా వుండేది. ఆయనలేని ఈ మూడు నెలలు చాలా మెల్లిగా కష్టంగా జరిగింది. ముఖ్యంగా ఈ ప్రముఖాంధ్ర పత్రిక. ఏ మాత్రం స్థాయి తగ్గకుండా, కరెక్టుగా నెలనెలా క్రమంగా తీసుకురావడం ఎలా చేసానా అని తెలియటం లేదు. ఆయన ఆరోగ్యం బాగాలేనప్పుడు నాన్నా రాయండి, రోజుకి ఒక్క పేజైనా రాయలేరా అని అడిగేవాడిని. ఎంత కర్కశంగా అడిగానో అని ఇప్పుడనిపిస్తోంది. పత్రిక నిర్వహణ అంత తేలిక కాదు. ఈ మూడు నెలలు ఆయన రాసిన మేటర్ కాస్త వుంది. పైగా కొంతమంది స్నేహితులు కొంతవరకు సపోర్టు చేశారు. ఎలాగో నెట్టుకొచ్చినా ఇకపై నేనే రాయాలి. నాన్నగారి శ్రేయోభిలాషులు శ్రీ కుప్పా వెంకటకృష్ణమూర్తిగారు ఫోనులో ధైర్యం చెబుతూ రాయండి. మీ నాన్నగారే మిమ్మల్ని వెన్నంటి నడిపిస్తారని చెప్పారు. అలాగే శ్రీభువనచంద్రగారు మీ నాన్నగారు పరకాయ ప్రవేశం చేసి రాయిస్తారని చెప్పారు.

చిన్నప్పటి నుండి ఒక వత్తిడికి అలవాటు పడిపోయిన వాడిని, నాన్నగారి నీడలో ఆయన వెన్నంటే వుండిపోయినవాడిని. ఆయన జీవితాన్ని దగ్గర్నుంచి చూసిన వాడిని, ఆయన ఆలనాపాలనలో పెరిగినవాడిని, నా కంటూ పెద్ద గొప్పతనమేదీ లేదు. ఒక్క గోటేటి శ్రీరామారావు అనే గొప్ప వ్యక్తిత్వమున్న గొప్ప వ్యక్తి యొక్క కుమారుడననే గొప్పతనం తప్ప. ఆయన లేకపోతే అడుగు కూడా బయటకు వెయ్యటానికి జంకే స్వభావం కలవాడిని. అమ్మ కూడా అంత బిడియస్తుడవైతే ఎలారా నలుగురిలో వెళ్ళి, మాట్లాడు అంటూండేది. వింటేగా అలాగే నాన్న కూడా ఎక్కడికైనా రమ్మన్నా కారు డ్రైవర్ లాగా వెళ్ళి ఆయన్ను కూర్చోబెట్టి నేను వచ్చేసి తిరిగి సభ అయ్యేటైముకు వెళ్ళి తీసుకొచ్చేసేవాడిని. నా ఆధ్వర్యంలో ఏదీ జరుగదు. ఆయన చెప్పింది చెయ్యడమే మన పని అనుకునేవాడిని. అలాంటివాడిని ఇప్పుడు ఇన్ని పనులు నిర్వహించాలంటే ఆయనే చెయ్యి పట్టుకుని నడిపించాలి. చెప్పానుగా ఆయన నీడలో పెరిగినవాడిని. ఇప్పుడు ఆయన ఏర్పరచిన, ఏర్పరచుకున్న పేరు, కీర్తి, మంచితనం, నీడలో ఆయనను తలచుకుంటూ వెన్నంటీ ఆయన వున్నారనే భావనలో భావంలో ఈ ప్రముఖాంధ్రలో ఆయనను తలచుకుంటూ బుల్లి బుల్లిగా అడుగులు వేస్తున్నాను. అడుగులు చిన్న పిల్లవాడు వేసే తప్పటడుగులు కావచ్చేమో గాని, ఎన్నటికీ తప్పుటి అడుగులు పడనివ్వను.

ఈ మార్చి 7 ఆయన్ను ఇలా తలచుకుంటానని ఊహించలేదు.

ఎప్పుడూ మా వూహలలో జీవించే నాన్నగారూ మీరలా చిరునవ్వుతో మా వెన్నంటి వుండండి.

✧ ✧ ✧

నేను ఎక్కువగా ప్రవచనాలకు వెడుతూ వుంటాను. అవి ఆంగ్లంలోనైనా కావచ్చు, అరవంలోనైనా కావచ్చు, తెలుగులోనైనా కావచ్చు. ఎక్కువగా అవి భగవద్గీత మీదే వుంటాయి. అక్కడ కనిపించే వారు సగం మందిని తీసుకుంటే అరవయ్యేళ్ళ పైబడినవారు. ముప్పాతిక భాగం వుంటారు. 45 నుంచి 60 ఏళ్ళవారు 15 శాతం, 30 నుంచి 40 ఏళ్ళ వారు 10 శాతం, 1 సంవత్సరం నుంచి (కొంతమంది పిల్లలతో వస్తారు) 30 సంవత్సరాలలోనివారు 5 శాతం వుంటారు. అరవై ఏళ్ళు పైబడినవారు ఎక్కువగా ఇంటిలో తోచకో మరెందుకు వస్తారో తెలియదు. గీతాసారాన్ని అర్థం చేసుకుని ఆ ప్రకారంగా దేశానికి, రాష్ట్రానికి, కుటుంబానికి ఉపయోగపడవలసిన కాలంలో ఉపయోగపడక కాలక్షేపానికి కథలాగా విని ఏమి ప్రయోజనం. పోని వీరందరూ కలిసి దేశ కాలమాన పరిస్థితులను చక్కబరచటానికో, బాగుపరచటానికో సలహాలు ఇవ్వడం చేస్తారా? లేదే, మరేమిటి ప్రయోజనం. కనీసం ప్రజా వ్యతిరేక పనులు జరుగుతున్నప్పుడు ఈ సీనియర్ సిటిజన్స్ తమయొక్క ఆందోళన, ఆవేదనను ప్రభుత్వానికి తెలియపరుస్తున్నారా, లేక కనీసం తనుండే ఇంటిలోనైనా దిద్దుబాటు చేస్తున్నారా? ఇవన్నీ ఆలోచించవలసిన సమయం ఆసన్నమైంది.

ఇదివరలో ఊరిలోని పెద్దలు ఒకచోట కూర్చొని మంచి చెడు మాట్లాడి ఊరి ప్రయోజనాలను దృష్టిలోనికి తీసుకొని మంచి సలహాలిస్తూ ముందుండి వారి పెద్దరికాన్ని నిలుపుకుంటూ మార్గదర్శకంగా ఉండేవారు. కాని ప్రస్తుతం సగానికి పైగా 60 ఏళ్ళకు పైబడినవారు ఉద్యోగాలనుండి విరామం పొందినట్లు (రిటైర్మెంట్) జీవితంలో కూడా ఏ విషయాలు పట్టించుకోకుండా వుంటున్నారు. దీనికి కారణం వారేనా? లేక వారినుంచి జీవితంలో పొందవలసినవన్నీ పొంది వారిని పట్టించుకోని యువతరందా? కొంతమంది ఇళ్ళలోని పెద్దలు (ఆడవారైతే) వంటలు పట్టించుకోని యువతరందా? కొంతమంది ఇళ్ళలోని పెద్దలు (ఆడవారైతే) వంటలు వండటానికి, ఇల్లు చూసుకోవడానికి, మగవారైతే మనవళ్లను, మనవరాలిని స్కూలు, ప్రైవేట్లు, సంగీత క్లాసులకు, రేషన్ షాపులకు, పాలకు వగైరాల కోసం వాడుకుంటున్నారు. అసలా పెద్దవాళ్ళంతా మొండికెత్తి మేము చెయ్యం అని చెపితే ఏమవుతుంది? అలా చెప్పలేక, కన్న పేగు తెంచుకోలేక

వారి అవస్థ చూస్తుంటే జాలివేస్తోంది. ఈ పెద్దవారు ఎందుకిలా వున్నారు. తప్పు వారి పెంపకంలో వుందా, లేక దేశ కాలమాన పరిస్థితులు మారిపోయాయా?

భారతదేశంలో మన వేదాలుకాని, పురాణాలు కాని, చరిత్రకాని, ఆఖరికి విక్రమార్క, పంచతంత్ర, పరమానంద శిష్యుల కథల్లో కూడా మనం నీతి సూత్రాలే కదా వల్లే వేసినది. ప్రపంచానికి మార్గదర్శకంగా వున్న మన భారతదేశ ఆచార వ్యవహారాలు, కుటుంబ వ్యవస్థ మన దేశంలోనే తిరోగమిస్తోందా? ప్రపంచీకరణ పేరులో దేశాన్ని ఎప్పుడో తాకట్టు పెట్టాం, అదే ప్రపంచీకరణ పేరుతో మానవత్వ విలువలను, పెద్దరికాన్ని, గౌరవాన్ని కూడా తాకట్టు పెట్టామా?

1990 నుంచి 2005 వరకూ వచ్చిన మార్పుల కారణమా, ఆ మార్పు రాను రాను ప్రతి సంవత్సరం ఇంకా ఎక్కువవుతోందే తప్ప తగ్గటం లేదు. కొడుకులు, కూతురులు విదేశాలలో వుంటూ చేతి నిండా డబ్బు సంపాదిస్తూ, అమ్మనాన్నలను పట్టించుకోని కుటుంబాలు నాకు చాలా తెలుసు. మీరు పంపే ఆ డబ్బు వృద్ధాశ్రమాలలో చేరడానికే పనికి వస్తుంది తప్ప, వారికి ఏమాత్రం తృప్తి, ఆనందం ఇవ్వదు. ఇన్నీ చేసిన తల్లిదండ్రులకు మనం ఇలా గౌరవం యిస్తుంటే, రేపు మనల్ని మన పిల్లలు ఎలా చూస్తారో అని ఒకసారి ఆలోచన చెయ్యండి. ఆ ఆలోచనే భయంకరంగా వుంటుంది. మీలో మార్పు తేవడానికి కారణం అవ్వొచ్చునేమో?

సీనియర్ సిటిజన్లు దేశంలోని పరిస్థితులకు చక్కదిద్దే చక్కటి అవకాశం వీరికున్నది. ధృతరాష్ట్రుని సభలో పెద్దలులాగా చూస్తూ కూర్చొనక (ఆరోజే దుర్యోధనుడు తప్పును సరిదిద్ది వుంటే కురుక్షేత్ర సంగ్రామము ఉండేదికాదు) సలహాలు సంప్రదింపులు చేస్తూ, ప్రభుత్వాలు కాని లేక ముఖ్యమంత్రులు, మంత్రులు ప్రజా వ్యతిరేక పనులు చేసినప్పుడు ఆ తప్పును ఎత్తిచూపుతూ వుంటే బాగుంటుంది. మనకెందుకని కృష్ణా, రామా అనుకుంటూ కూర్చుంటే ఆ కృష్ణుడు, రాముడు కూడా హర్షించరు. ఇప్పటి మన హిందూ సమాజంలో పగ, వైరం, ద్వేషం, అల్పబుద్ధి, అసూయ, హింస అధికమవుతున్నాయి. దీనికి కారణం నైతిక స్వభావంలో లోపం. దీని కోసం మార్పులెన్నో జరగాలి. కాబట్టి పెద్దలందరూ తమలో వున్న బుద్ధికుశలతను, మేధాశక్తిని, జ్ఞానాన్ని సరిగ్గా ఉపయోగించుకుంటూ యువకులను తగిన విధంగా ప్రోత్సహిస్తూ వుండాలి. మన పెద్దలలో ఎంతోమంది విద్యావేత్తలు, విజ్ఞాన శాస్త్రవేత్తలు, తత్వవేత్తలు వున్నారు. ఆ పెద్దలు తనుకున్న ప్రతిభలో, పేరు ప్రతిష్ఠలలో, లేక ధనంతో దేశం కోసం, దేశీయుల కోసం ఆలోచిస్తూ, నిద్రపోతున్న యువకులను మేల్కొల్పి, ధనసంపాదనే ముఖ్యం కాదని తెలుపుతూ, వారిని సరైన మార్గంలో పెడతారని ఆశిస్తున్నాను. అలాగే యువతరం కూడా పెద్దవారిని గౌరవిస్తూ వారి సలహాలను పాటించమని మనవి చేస్తున్నాను.

– గోటేటి వెంకటేశ్వరరావు

స్థానం వారి స్థానం ఎవరికి లభించలేదు?



ఆంధ్ర నాటక రంగ పౌరాణిక పద్యనటుల్లో ఒక్కొక్కరి బాణీ ఒక్కరిది. కొందరు బాణీలను కొందరు అలవరచు కున్నప్పటికీనీ అది 'అనుకరణే' అయిందితప్ప వారి తరహా బాణీగా రూపొందలేదు ఆ రోజుల్లో నాటకం ఒక మహాయాగంగానూ, తాము ఆ పాత్రలకు సరిదీటైన నటయోగులుగానూ భావించి, పాత్రే తానుగా, తానే పాత్రగా లీనమయ్యేవారు. కొందరు చేంతాడు వంటి దీర్ఘంగా రాగాలు తీసినప్పటికినీ ఆ పాత్రకు వారే సరితూగినట్లుండేవారు.

అలాగే ఆనాడు నాటకరంగమ్మీద స్త్రీ పాత్రల్ను పురుషులే ధరించేవారు. ముప్పిడి జగ్గరాజు, ఉప్పులూరి సంజీవరావు, కొపల్లె హనుమంతరావు, తోట వేంకటేశ్వరరావు గార్లున్నప్పటికినీ, స్థానం నరసింహారావు గారిదొక ప్రత్యేక బాణీగా ఉండేది. ఆయన ధరించిన సత్యభామ, మురు పాత్రలు చిత్రాంగి, మధురవాణి, మీరా, లీలావతి, మోహిని, చింతామణి, రోషనార, చంద్రమతి పాత్రలూ, కన్యాశుల్కంలోని హోయలొలికించే మధురవాణి పాత్ర హాస్య, లాస్య, శృంగార రసాల సమ్మిళితంగా ఆడవాళ్లు కూడా చేయలేనంత అందచందంగా ఉండేవట. 'ఆంధ్ర నాటక రంగ అప్సరస'గా శ్రీ స్థానం వారిని కొలిచేవారు. కవులు కావ్యాల్లో కొని తేలేని శృంగారాన్ని, హోయల్నీ స్థానం వారు చూపించేవారు). 1500 పై చిలుకు నాటక ప్రదర్శనము లిచ్చారనీ, నటనా వైదుష్యం, వాచిక వైదగ్ధ్యం, ప్రౌఢాభ్యాస పద్ధతి, ఫణితి మరొకరికి అబ్బలేదని అంటారు. నా మనోజ్ఞ వాణి, నా మధురవాణి, నా ప్రియురాలా అని ప్రేక్షకులు ఈలలు వేసేవారట. ఆయన రచయిత 'నటస్థానం' అనే స్వీయచరితను వ్రాశారుట.

చిరుగంటి చిందులు వేయుచు రావయ్య రంగా రంగా
తిరుమోమున సౌభాగ్యమును జూపవ రంగా రంగా
మురియించీ నూరించీ మోహించు నీమోము రంగా రంగా
దరిజేర్చి లాలించి ధ్యానించి పూజింతు రంగా రంగా

– అన్న స్థానంవారి పాట గ్రామఫోను రికార్డుగా వచ్చిందంటారు.

జై జై మహాంధ్ర రాష్ట్రావనీ శోభినీ
మురియు మా ముక్కోటి మ్రొక్కులందీ
వేదార్థ భాష్యార్థ విజ్ఞాన మూర్తినీ
బ్రోవు మా మా మనః పూజలందీ

అంటూ ఆంధ్రోద్యమ సందర్భంలో వ్రాశారని కూడా విన్నాం. నటనలోనే గాకుండా, రచనలో కూడా చేయి తిరిగిన ప్రతిభాశాలి శ్రీస్థానం. ఒకసారి ప్రఖ్యాత రచయిత హరీంద్రనాథ చటోపాధ్యాయ వీరి సత్యభామ పాత్రను, అభినయాన్నీ జూచి, ఓ పేజీ ఉత్తరం వ్రాశారుట. భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' బిరుదంతోనూ, ఇతర సంస్థలనేక బిరుదములతోనూ ఏలూరులో కొందరు బంగారంతో షీల్డు యిస్తే, దానిని ఆంధ్ర నాటక కళా పరిషత్తు బహూకరించి ఉత్తమ నాటక ప్రదర్శనకు రోలింగ్ షీల్డుగా యివ్వమని ఇచ్చేశారుట. స్థానం స్థానాన్ని భర్తీ చేసేవారెవ్వరూ లేరు. 1971 డిసెంబర్ 21న తన నటనా సొగసుల గుభాళింపులను విడిచి, అందని తీరాలకు వెళ్లిపోయారు.

ప్రముఖాంధ్ర రజతోత్సవ సంచికకు ఎదురుచూడండి

ఈ 2019వ సంవత్సరంలో ప్రముఖాంధ్రకు 24 ఏళ్ళు పూర్తయ్యి 25వ సంవత్సరంలోకి అడుగిడింది. ఈ సందర్భంలో ఒక ప్రత్యేక సంచికను తీసుకురావాలని సంకల్పించాం. శ్రీగోటేటి శ్రీరామారావుగారి మానస పుత్రిక, ఆయన నిరంతరం శ్రమించి వయోభారాన్ని కూడా లెక్కచెయ్యకుండా ఆయన తెలుగువారి పట్ల, తెలుగు భాష పట్ల పడిన తపన, తపః ఫలమే ఈ ప్రముఖాంధ్ర. రజతోత్సవ ప్రత్యేక సంచికకు ప్రముఖాంధ్రుల విశేషాలను త్రిలింగదేశంలో విరాజిల్లిన ధార్మిక సంస్కృతిని, విపులంగా, మే మెరిగినంత విశదంగా, చిత్తరవులతో మీమీ అమూల్య రచనలను, ఈ 24 సంవత్సరాలలో ప్రముఖాంధ్రలో మీరు పొందిన అనుభవాలు పంపించండి. అంతేకాదు మీరు కూడా చందాదారులుగా రూ.2116ను పంపిస్తూ మీరు మరొక్కరిని ఇంకో రూ.2116లను చేర్పించగలరని ఆశిస్తున్నాను. ప్రపంచమంతా ప్రముఖాంధ్రుల మయం కావాలి. ప్రముఖాంధ్ర తేజం ప్రపంచమంతటా వెల్లివెరియాలి.